# వాస్తవ నేస్తం
తెలుగు దిన పత్రిక
ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...



విలేకరులు కావలెను
వాస్తవ నేస్తం
సంప్రదించండి
తెలంగాణ 8099779988
ఆంధ్రప్రదేశ్ 9985337979
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో
వాస్తవ నేస్తం దిన పత్రికలో పనిచేయుటకు ఉత్సాహవంతులైన
- జిల్లా బ్యూరో చీఫ్‌లు
- జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు
- నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు
- మండల రిపోర్టర్లు కావలెను



సంపుటి : 2 | సంచిక : 226 | శనివారం 24 ఫిబ్రవరి 2024 | పేజీలు : 8 | వెల : 5/-

Published form Adilabad, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda, Medchal Malkajgiri


# మార్చి 13 తర్వాత షెడ్యూల్



**అన్ని రాష్ట్రాల ఎన్నికల అధికారులతో వరుస భేటీలు**

- ఇప్పటికే ఇందుకు సంబంధించి ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లు పూర్తి
- ఈసీ బృందం పలు రాష్ట్రాల్లో పర్యటించి అక్కడి ఎన్నికల ఏర్పాట్లపై సమీక్ష
- ఈ ప్రక్రియంతా పూర్తైన వెంటనే షెడ్యూల్ విడుదల
- ప్రస్తుతం తమిళనాడులో పర్యటిస్తోన్న కేంద్ర ఎన్నికల సంఘం బృందం
- పలు ప్రాంతాల్లోని సమస్యలు, ఈవీఎమ్‌లు తరలించేందుకు ఎదురయ్యే సవాళ్లు, ఇతరత్రా భద్రతా పరమైన సమస్యలపై చర్చ
- నిఘా పెంచాలని అధికారులను ఆదేశం

-2లో



## కొనసాగుతున్నా అధికారుల బదిలీలు

ఐదుగురు ఐఏఎస్‌ల బదిలీ

నీటి పారుదల శాఖ ప్రత్యేక కార్యదర్శిగా జీవన్ పాటిల్

సిద్ధిపేట కలెక్టర్ గా మను చౌదరి


రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శిగా శైలజా రామయ్యర్‌కు అదనపు బాధ్యతలు

హైదరాబాద్

తెలంగాణలో అధికారుల బదిలీలు కొనసాగుతున్నాయి. లోక్ సభ ఎన్నికలు దగ్గర పడుతున్న వేళ మరోసారి పలువురు ఐఏఎస్ అధికారులను బదిలీ చేసింది రేవంత్ సర్కార్. ఈ మేరకు రాష్ట్ర సీఎస్ శాంతి కుమారి ఉత్తర్వులు జారీ చేశారు. సిద్దిపేట జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్‌ను నీటిపారుదల శాఖ స్పెషల్ సెక్రటరీగా బదిలీ చేశారు. సిద్ధిపేట నూతన కలెక్టర్ గా కామారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరిని నియమించించారు. వరంగల్ మున్సిపల్ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషాను జనగాం జిల్లా కలెక్టర్‌గా బదిలీ చేశారు. అలాగే వరంగల్ జిల్లా కలెక్టర్ శివలింగయ్యను సాధారణ పరిపాలన శాఖలో రిపోర్టు చేయాల్సిందిగా ఆదేశించారు. ప్రస్తుత పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల శాఖ ముఖ్య కార్యదర్శిగా ఉన్న శైలజా రామయ్యర్‌కు రెవెన్యూ ముఖ్య కార్యదర్శి -మిగతా3లో

# త్వరలోనే రుణమాఫీ

- ఎన్నికల్లో ఇచ్చిన ప్రతిహామీని అమలు చేస్తామని
- తెలంగాణ రైతులకు త్వరలోనే శుభవార్త: సీఎం రేవంత్
- ఇప్పటికే మహిళలకు ఉచిత బస్సుప్రయాణం
- రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.పది లక్షలకు పెంచాం
- అధికారంలోకి వచ్చిన 60 రోజుల్లోనే 25 వేల ఉద్యోగాలు భర్తీ చేశాం
- మార్చి 2వ తేదీన మరో 6 వేలపైచిలుకు ఉద్యోగాలు భర్తీ
- గ్రామీణల్లో యువకులకు ఉద్యోగాలు కల్పించేందుకు పది స్కిల్ యూనివర్సిటీలు ఏర్పాటు
- 82 27వ తేదీన రెండు హామీల అమలు ప్రారంభం...
- రూ.2 లక్షల రుణమాఫీపై త్వరలోనే రైతులకు శుభవార్త
- సమ్మక్క సారలమ్మ ఆశీర్వాదంతోనే తెలంగాణలో ఇందిరమ్మ రాజ్యం



వన దేవతలను దర్శించుకున్న సీఎం రేవంత్

వివరాలు 3లో..

# కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత మృతి

- రోడ్డు ప్రమాదంలో కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత దుర్మరణం
- పటాన్‌చెరు ఓఆర్ఆర్‌పై దుర్ఘటన.. స్పాట్‌లోనే లాస్య మృతి
- ఎమ్మెల్యేగా గెలిచాక వరుస ప్రమాదాలు
- పది రోజుల కిందటే నల్లగొండ వద్ద రోడ్డు ప్రమాదంలో స్వల్ప గాయాలు
- అంతకు ముందు.. 3గం. పాటు లిఫ్ట్‌లోనూ ఇరుక్కున్న ఘటన
- కంటోన్మెంట్ మాజీ ఎమ్మెల్యే, దివంగత సాయన్న కుమార్తె లాస్య నందిత
- తండ్రి మరణంతో తనయకు టికెట్ ఇచ్చిన బీఆర్ఎస్
- అసెంబ్లీ ఎన్నికల్లో 17 వేల మెజార్టీతో నెగ్గిన లాస్య
- తండ్రి చనిపోయిన ఏడాదికే యాక్సిడెంట్‌లో లాస్య దుర్మరణం
- యువ నేత అకాలమరణంపై రాజకీయ ప్రముఖుల దిగ్భ్రాంతి

హైదరాబాద్

తెలంగాణ రాజకీయ వర్గాల్లో తీవ్ర విషాదం నెలకొంది. సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత(33) రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. శుక్రవారం వేకువ ఝామున పటాన్‌చెరు ఓఆర్ఆర్ వద్ద ఆమె ప్రయాణిస్తున్న కారు అదుపు తప్పి ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో లాస్య నందిత అక్కడికక్కడే మృతి చెందారు. కారు నడిపిన ఆమె పీఏ, స్నేహితుడు ఆకాష్‌కు తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స -మిగతా3లో



## రాహుల్‌కు మతి చెడింది?

- 'తెలివిలేనివారే అలాంటి వ్యాఖ్యలు చేస్తారు'
- వారణాసి యువకుల కామెంట్లపై ప్రధాని మోదీ విసుర్లు
- 'వాళ్లు నరేంద్ర మోదీని దశాబ్దాలుగా దూషిస్తున్నారు
- ప్రస్తుతం వాళ్లు తమ అసహనాన్ని ప్రజల మీద చూపిస్తున్నారు



# కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేది లేదు చచ్చేది లేదు

- ఆర్టికల్ 370 ని రద్దుతో కశ్మీర్‌లో జాతీయ జెండా రెపరెపలాడుతోంది
- రాహుల్ గాంధీ నాయకత్వాన్ని కాంగ్రెస్ నాయకులే వద్దంటున్నారు.
- కేసీఆర్ పాపాల ఫలితమే బీఆర్ఎస్ ఓటమి..

మంచిర్యాల

వచ్చే పార్లమెంట్ ఎన్నికలు దేశ భవిష్యత్తుకు సంబంధిం చినవని.. మోదీతోనే దేశ భవిష్యత్తు భద్రంగా ఉంటుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. దేశంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేది లేదు చచ్చేది లేదన్నారు. రాహుల్ గాంధీ నాయకత్వాన్ని కాంగ్రెస్ నాయకులే వద్దంటున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ దేశాన్ని ఏలి రూ.12 లక్షల కోట్ల ప్రజాధనాన్ని కాజేసిందని -మిగతా3లో




# చంద్రుడి ఒడిలో 'ఒడిస్సియస్'!

జాబిలిపైకి ల్యాండర్ల పరంపర కొనసాగుతోంది. జపాన్ 'మూన్ స్నైపర్' ల్యాండర్ తర్వాత తాజాగా అమెరికా వంతు వచ్చింది. అర్ధ శతాబ్దం తర్వాత చంద్రుడిపై మరోమారు అగ్రరాజ్యం జెండా రెపరెపలాడింది. అమెరికాలోని టెక్సాస్ రాష్ట్రంలో హూస్టన్ కేంద్రంగా పనిచేస్తున్న ప్రైవేటు సంస్థ 'ఇంట్యూటివ్ మెషీన్స్' రూపొందించిన 'ఒడిస్సియస్' (నోవా-సీ శ్రేణి) ల్యాండర్ జాబిలి ఉపరితలంపై దక్షిణ ధ్రువం చేరువలోని 'మాలాపెర్ట్ ఎ' బిలంలో దిగ్విజయంగా దిగింది. తొలుత ల్యాండర్ నేవిగేషన్ వ్యవస్థలోని లేజర్ రేంజిఫైండర్లలో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో మిషన్ కంట్రోల్ కేంద్రంలోని శాస్త్రవేత్తలు ఆందోళన చెందారు. దీంతో ల్యాండర్ దిగాల్సిన నిర్దేశిత సమయంలో కొంత జాప్యం సంభవించినప్పటికీ భారత కాలమానం ప్రకారం శుక్రవారం తెల్లవారుజామున 4:53 గంటలకు అది క్షేమంగా చంద్రుడిపై దిగి భూమికి సంకేతం పంపింది.

'మాలాపెర్ట్ ఎ' అనేది చంద్రుడి దక్షిణ ధృవానికి 300 కిలోమీటర్ల దూరంలో 85 డిగ్రీల దక్షిణ అక్షాంశ ప్రాంతంలో నెలకొన్న ఓ చిన్న బిలం. బెల్జియంకు చెందిన 17వ శతాబ్దపు ఖగోళ శాస్త్రవేత్త చార్లెస్ మాలాపెర్ట్ పేరును దానికి పెట్టారు. చంద్రుడి దక్షిణ ధ్రువానికి అతి సమీపంలో దిగిన వ్యోమనౌకగా చరిత్ర సృష్టించిన 'ఒడిస్సియస్'%ా% ఆ విషయంలో గత ఏడాది మన చంద్రయాన్-3 'విక్రమ్' ల్యాండర్ పేరిట ఉన్న రికార్డును బద్దలుకొట్టడం విశేషం.

'ఒడిస్సియస్' ల్యాండరుకు 'ఇంట్యూటివ్ మెషీన్స్' సంస్థ ఉద్యోగులు పెట్టుకున్న ముద్దు పేరు 'ఒడీ'. ఈ మానవరహిత చంద్రయాత్రకు మిషన్ 'ఐఎం-1'గా నామకరణం చేశారు. జీవితకాలం ఏడు రోజులే! పూర్తిగా ఓ ప్రైవేటు కంపెనీ తయారీ-నిర్వహణలో ల్యాండర్ ఒకటి చంద్రుడి ఉపరితలంపై సజావుగా దిగడం ఇదే తొలిసారి. సాంకేతిక అవాంతరాలు ఎదుర్కొన్నప్పటికీ జపాన్ 'స్లిమ్' ల్యాండర్ మాదిరిగా తలకిందులుగా కాకుండా 'ఒడిస్సియస్' నిటారుగానే దిగినట్టు శాస్త్రవేత్తలు గుర్తించారు. షడ్భుజి ఆకృతితో, సిలిండర్ ఆకారంలో టెలిఫోన్ బూత్ కంటే కాస్త పెద్ద పరిమాణంలో ఉన్న ఈ ల్యాండరులో 100 కిలోల బరువైన ఐదు 'నాసా' పరికరాలు, ఇతర వాణిజ్య సంస్థలకు చెందిన ఆరు శాస్త్రీయ పరికరాలు (పేలోడ్స్) ఉన్నాయి. అవి చంద్రుడిపై పరిశోధనలు నిర్వహిస్తాయి.

వీటిలో లేజర్ రెట్రో రిఫ్లెక్టర్, ఐఎల్ఓ-ఎక్స్ అబ్జర్వేటరీ (టెలిస్కోప్) ఉన్నాయి. జాబిలిపై 'ఒడిస్సియస్' జీవితకాలం





కేవలం ఏడు రోజులు. మరో వారం రోజుల్లో అది దిగిన ప్రదేశంలో సూర్యాస్తమయం అవుతుంది. కనుక ల్యాండర్ పనిచేయడానికి సౌరశక్తి లభించదు. చంద్రుడి ఉపరితలంతో అంతరిక్ష వాతావరణం చర్యనొందే విధానం, రేడియో ఆస్ట్రానమీ, చంద్రావరణానికి సంబంధించిన డేటాను 'నాసా' పేలోడ్స్ సేకరించనున్నాయి. అమెరికా చివరిసారిగా 1972లో చేపట్టిన 'అపోలో-17' మానవసహిత యాత్రలో వ్యోమగాములు జీన్ సెర్నాన్, హారిసన్ ష్మిట్ చంద్రుడి నేలపై నడయాడారు. ఆ తర్వాత అమెరికా వ్యోమనౌక ఒకటి నియంత్రిత విధానంలో చంద్రుడిపై దిగడం ఇదే మొదటిసారి. చైనా కంటే ముందుగా తమ 'ఆర్టెమిస్' యాత్రతో త్వరలో జాబిలిపైకి తమ వ్యోమగాములను పంపాలని అమెరికా భావిస్తోంది. ఈ నేపథ్యంలో 'ఒడిస్సియస్' సేకరించే సమాచారం కీలకం కానుంది. చంద్రుడిపైకి ప్రైవేటు ల్యాండర్లను ప్రయోగించడానికి ఉద్దేశించిన తన కమర్షియల్ లూనార్ పేలోడ్ సర్వీసెస్ ప్రాజెక్టులో భాగంగా 'నాసా' వెయ్యి కోట్ల రూపాయల విలువైన ఈ మిషన్ కాంట్రాక్టును 'ఇంట్యూటివ్ మెషీన్స్'కు కట్టబెట్టింది. చంద్రుడి సూక్ష్మ శిల్పానికి గాంధీ పేరు! ఆరు కాళ్లపై నిలబడే 'ఒడిస్సియస్' ల్యాండర్ ఎత్తు 4 మీటర్లు కాగా, వెడల్పు సుమారు 2 మీటర్లు. ప్రయోగ సమయంలో ల్యాండర్ బరువు 1,908 కిలోలు. ఈ నెల 15న ఫ్లోరిడాలోని కేప్ కెనెవరాల్ నుంచి కెన్నెడీ అంతరిక్ష కేంద్రం వేదికగా ఇలాన్ మస్క్ సంస్థ 'స్పేస్-ఎక్స్'కు చెందిన ఫాల్కన్ 9 రాకెట్ సాయంతో దాన్ని ప్రయోగించారు. భూమి నుంచి చూస్తే చంద్రుడిలో కనిపించే 62 దశలు, అంతరిక్షంలోని ఇతర ప్రాంతాల నుంచి చూస్తే చంద్రుడిలో అగుపించే మరో 62 దశలు, ఒక చంద్రగ్రహణం... మొత్తం కలిపి చంద్రుడి 125 దశలను ప్రతిబింబించే సూక్ష్మ శిల్పాలను ఓ పెట్టెలో పెట్టి ల్యాండరులో అమర్చడం విశేషం. వీటిని అమెరికన్ కళాకారుడు జెఫ్ కూన్స్ రూపొందించారు. ఒక్కో బుల్లి శిల్పం వ్యాసం అంగుళం. ఈ శిల్పాలకు మానవ చరిత్రలో అత్యంత ప్రాముఖ్యమున్న అరిస్టాటిల్, లియోనార్డో డా విన్సీ, గాంధీ, డేవిడ్ బౌయీ, బిల్లీ హాలిడే తదితరుల పేర్లు పెట్టారు. భూమికి 'ఒడిస్సియస్' ల్యాండర్ పంపిన సంకేతం బలహీనంగా ఉన్నట్టు తెలుస్తోంది. ఫలితంగా ల్యాండర్ భవితపై అనిశ్చితి నెలకొంది. దీంతో మిషన్ కంట్రోల్ కేంద్రంలో హర్షధ్వానాలు, విజయోత్సవాలను రద్దు చేశారు. ల్యాండర్ సంకేతాలను మెరుగుపరచేందుకు 'ఇంట్యూటివ్ మెషీన్స్' శాస్త్రవేత్తలు కృషి చేస్తున్నారు.

## గ్రీన్ ఇండస్ట్రీ ద్వారా 40 లక్షల ఉద్యోగాలు

**చెన్నై :** దేశ నిరుద్యోగులకు కేంద్రం గుడ్ న్యూస్ చెప్పింది. గ్రీన్ ఇండస్ట్రీ ద్వారా 18.5 మిలియన్ల వ్యక్తులకు ఉపాధి కల్పిస్తోంది. ఈ ఉద్యోగాల సంఖ్య వచ్చే 2025 నాటికి 4 మిలియన్లకు పెంచనుంది. భారత్‌లోని హరిత పరిశ్రమ (గ్రీన్ ఇండస్ట్రీ) ప్రస్తుతం 18.5 మిలియన్ల మందికి ఉపాధి కల్పిస్తుందని.. 2025 నాటికి హరిత పరిశ్రమ మరింత అభివృద్ధి చెందుతుందని, తద్వారా మొత్తం 4 మిలియన్ల ఉద్యోగాలు అందుబాటులోకి రానున్నట్లు జఐకు చెందిన ఎర్త్‌షాట్ ప్రైజ్ 2023 విజేత, ూ4ూ టెక్నాలజీస్ సహ వ్యవస్థాపకురాలు నిధి పంత్ ప్రపంచ బ్యాంకుకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. శిలాజ ఇంధనాల పరివర్తన కారణంగా 2030 నాటికి క్లీన్ ఎనర్జీ, తక్కువ-ఉద్గార సాంకేతికతలలో 30 మిలియన్ల 'గ్రీన్' ఉద్యోగాలు సృష్టించబడతాయి. ప్రపంచ బ్యాంకు ప్రకారం.. గ్రీన్ జాబ్ పర్యావరణ లక్ష్యాలను కలిగి ఉంటుంది. గ్రీన్ ఉద్యోగాలు ఒక రంగానికి మాత్రమే పరిమితం కావు. పునరుత్పాదక శక్తి, హరిత ఉత్పత్తులు, తయారీ, స్థిరమైన వ్యవసాయం, వృత్తాకార రీసైక్లింగ్ ఆర్థిక వ్యవస్థల్లో భాగమై ఉంటుంది. సోలార్ ఇంజనీర్ నుంచి ఆర్కిటెక్ట్ వరకు.. వ్యర్థాలను సేకరించే వ్యక్తి వరకు.. గ్రీన్ జాబ్స్ ఉంటాయి. అయితే గ్రీన్ ఉద్యోగాల్లో పునరుత్పాదక ఇంధనం త్వరితగతిన పెరిగింది. మరిన్ని దేశాలు శిలాజ ఇంధనాల నుంచి వైదొలగడంతో.. పునరుత్పాదక ఇంధనాలలో గ్రీన్ జాబ్ ఉపాది అవకాశాలు పెరుగుతున్నాయి.గ్రీన్ ఎనర్జీని అంగీకరించే విషయంలో భారతదేశం చాలా స్పష్టమైన మార్పును చూస్తోంది. భారతదేశం దాదాపు 180 గిగావాట్ల వ్యవస్థాపిత పునరుత్పాదక సామర్థ్యాన్ని కలిగి ఉంది. ఇది ఇప్పుడు గణనీయ పరిష్కారాల కోసం చూస్తోంది. అంటే శిలాజ ఇంధనాలపై ఆధారపడకుండా పూర్తిగా దూరం అవుతుంది. ప్రపంచంలో ఎలక్ట్రికల్ టూ వీలర్ల అభివృద్ధిలో భారత్ అగ్రగామిగా ఉంది. గృహాలపై సౌర ఫలకాలను అమర్చడానికి మద్దతు ఇచ్చే కొత్త విధానం ఇప్పుడు అందుబాటులోకి వచ్చింది. రాబోయే దశాబ్దంలో సుస్థిరత, పునరుత్పాదక పరిశ్రమపై ట్రిలియన్ల డాలర్లు ఖర్చు పెట్టే అవకాశం ఉంది. ఈ విధమైన అవకాశాలు అందిపుచ్చుకోవడానికి ప్రపంచ దేశాలు తమ విద్య వ్యవస్థ, శిక్షణ, పాఠ్యాంశాలలో మార్పు తీసుకురావల్సి ఆవస్యకత ఎంతైనా ఉంది. ఎందుకంటే దీని పరిధి చాలా పెద్దది.

## అపార్ట్‌మెంట్‌లలో చెలరేగిన మంటలు.. నలుగురు మృతి



**మాడ్రిడ్:** స్పెయిన్‌లోని వాలెన్సియా పట్టణంలో భారీ అగ్నిప్రమాదం జరిగింది. రెండు 14 అంతస్తుల అపార్ట్‌మెంట్‌లలో చెలరేగిన మంటలు చెలరేగిన ఘటనలో నలుగురు మృతి చెందగా 13 మందికి గాయాలయ్యాయి. గాయాలపాలైన వారిలో పిల్లలు, ఫైర్ సిబ్బంది ఉన్నారు. మరో 14 మంది జాడ తెలియడం లేదు. అగ్ని ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే రంగంలోకి దిగిన రెస్క్యూ సిబ్బంది క్రేన్ల సాయంతో అపార్ట్‌మెంట్‌లలో చిక్కుకున్నవారిని రక్షించారు. తొలుత ఒక అపార్ట్‌మెంట్‌లో చెలరేగిన మంటలు క్రమంగా పక్కనే ఉన్న మరో అపార్ట్‌మెంట్‌కు వ్యాపించాయి. భారీ అగ్ని జ్వాలలు, పొగ ఎగిసిపడుతున్న వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు. భవన నిర్మాణంలో వాడిన సామగ్రి కారణంగానే మంటలు వేగంగా వ్యాపించినట్లు స్థానిక వార్తా సంస్థలు తెలిపాయి. స్పెయిన్ ప్రధాని పెడ్రో షాంచేజ్ అగ్ని ప్రమాద ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు.

# 2024లో జీతం ఎంత పెరుగుతుందో తెలుసా..?

దేశంలో 2024లో వేతనాలు సగటున 9.5% పెరిగే అవకాశం ఉందని సర్వేలో వెల్లడైంది. అంతర్జాతీయ వృత్తి నిపుణుల సేవల సంస్థ ఎయాన్ పీఎల్‌సీ ఈ సర్వే నిర్వహించింది. ఈ సర్వేలో భాగంగా 45 రంగాలకు చెందిన 1,414 కంపెనీల డేటాను విశ్లేషించింది.

కరోనా పరిణామాల అనంతరం 2022లో దేశీయంగా అధిక వేతన పెంపు లభించిందని, రానున్న రోజుల్లో గరిష్ఠ స్థాయిలో వేతనాలు పెంపు ఉంటోందని తెలిపింది. సంఘటిత రంగానికి అంచనా వేసిన ఈ వేతన పెంపు.. దేశ ఆర్థిక వ్యవస్థ వృద్ధికి అనుగుణంగా వ్యూహాత్మక సర్దుబాటును సూచిస్తోందని పేర్కొంది. 'మౌలిక సదుపాయాలు, తయారీ రంగాలు గణనీయ వృద్ధిని నమోదు చేస్తాయి. కొన్ని రంగాల్లో మరిన్ని పెట్టుబడులు అవసరమవుతాయి' అని ఎయాన్



ఇండియాలో ట్యాలెంట్ సొల్యూషన్స్‌కు ముఖ్య కమర్షియల్ అధికారిగా ఉన్న రూపాంక్ చౌదరి తెలిపారు. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు ఉన్నప్పటికీ.. పటిష్ఠ ఆర్థిక వ్యవస్థగల దేశాల్లో, వేతన పెంపు అధికంగా ఉంటున్న దేశాల్లో భారత్ అగ్రగామిగా కొనసాగుతుందని సర్వే తెలిపింది. ఆ తర్వాతి స్థానాల్లో బంగ్లాదేశ్, ఇండోనేషియా ఉన్నాయని పేర్కొంది. 2024లో ఈ రెండు దేశాల్లో సగటు వేతన పెంపు 7.3 శాతం, 6.5 శాతంగా ఉండనుందని పేర్కొంది. మనదేశంలో సిబ్బంది వలసల రేటు 2022లో 21.4% కాగా.. 2023లో 18.7 శాతానికి పరిమితమైందని సర్వే తెలిపింది. ఉద్యోగాల కోసం పోటీ ఎక్కువగానే ఉందని పేర్కొంది. రంగాలవారీగా చూస్తే.. ఆర్థిక సేవల సంస్థలు, ఇంజినీరింగ్, వాహన, లైఫ్ సైన్సెస్ రంగాల్లో అత్యధిక వేతన పెంపు ఉండే అవకాశం ఉంది. రిటైల్, టెక్నాలజీ కన్సల్టింగ్, సేవల రంగాల్లో తక్కువ వేతన పెంపు ఉండొచ్చని సర్వే ద్వారా తెలిసింది.

## రష్యా- ఉక్రెయిన్ యుద్ధం.. అక్కడి భారతీయులకు కేంద్రం కీలక సూచన



**న్యూఢిల్లీ:** రష్యాలోని భారతీయులు రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి దూరంగా ఉండాలని కేంద్ర విదేశాంగశాఖ సూచించింది. ఈ మేరకు ఒక అడ్వైజరీని జారీ చేసింది. ఈ విషయమై శుక్రవారం విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ ఢిల్లీలో మీడియాతో మాట్లాడారు. కొందరు భారతీయులు రష్యాలో సైనికులకు సహాయకులుగా ఉండేందుకు అంగీకరిస్తూ కాంట్రాక్టులపై తెలియక సంతకాలు చేశారని జైస్వాల్ చెప్పారు. తాము ఈ విషయమై రష్యా ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతున్నామన్నారు. రష్యాలో ఆర్మీ హెల్పర్లుగా పనిచేస్తున్న భారతీయులను విడుదల చేయించేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయన్నారు. కాగా, ఇప్పటికే ఎంఐఎం చీఫ్,ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ కూడా ఈ అంశాన్ని ఇప్పటికే విదేశీ వ్యవహారాల శాఖ దృష్టికి తీసుకొచ్చారు. భారత్ నుంచి మొత్తం 12 మంది యువకులు దళారుల మాటలు విని మోసపోయి రష్యాకు వెళ్లారని తెలిపారు. వీరిలో తెలంగాణ వాసులు ఇద్దరు ఉన్నట్లు తెలిపారు. మిగిలినవారు కర్ణాటక, గుజరాత్, కశ్మీర్, యూపీలకు చెందినవారన్నారు. రష్యాలో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ వీరందరినీ ఏజెంట్లు మోసం చేశారని ఆరోపించారు. బాధిత కుటుంబాలు తనకు మొరపెట్టుకోవడంతో విదేశాంగశాఖ మంత్రి జైశంకర్‌తో పాటు రష్యాలో భారత రాయబారికి కూడా లేఖలు రాశానన్నారు. ప్రభుత్వం చొరవ చూపి వారిని స్వస్థలాలకు తీసుకురావాలని ప్రభుత్వాన్ని కోరారు.

## ఏడు విడతల్లో పోలింగ్.. మార్చిలో ఎన్నికల షెడ్యూల్!

**ఢిల్లీ:** లోక్ సభ ఎన్నికల ఏర్పాట్లలో కేంద్ర ఎన్నికల సంఘం బిజీగా ఉంది. ఇప్పటికే పలు రాష్ట్రాల్లో ఎన్నికల సంఘం అధికారులు పర్యటిస్తున్నారు. ఆయా చోట్ల ఎన్నికలు నిర్వహించేందుకు పరిస్థితులను అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం తమిళనాడు రాష్ట్రంలో అధికారులు పర్యటిస్తున్నారు. తర్వాత ఉత్తర ప్రదేశ్ జమ్ము కశ్మీర్‌లో పర్యటిస్తారు. అన్ని రాష్ట్రాల్లో అధికారుల పర్యటన మార్చి 13వ తేదీ లోపు ముగియనుంది. 13వ తేదీ తర్వాత ఏ క్షణమైన లోక్ సభ ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసే అవకాశం ఉంది. గత కొన్ని నెలలుగా రాష్ట్రాల్లో ఉన్న చీఫ్ ఎలక్ట్రోరల్ ఆఫీసర్లతో కేంద్ర ఎన్నికల సంఘం అధికారులు సమీక్ష నిర్వహిస్తున్నారు. సమస్యాత్మక ప్రాంతాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈవీఎంల తరలింపు, భద్రతా దళాల మోహరింపు, సరిహద్దుల్లో భద్రత కట్టుదిట్టం చేయాలని కేంద్ర అధికారులు స్పష్టం చేశారు. లోక్ సభ ఎన్నికల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాయం తీసుకోవాలని కేంద్ర అధికారులు భావిస్తున్నారు.

**ఏఐ సాయం**

లోక్ సభ ఎన్నికలను స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు ఏఐ సేవలను వినియోగిస్తారు. సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు సమాచారంపై కేంద్ర ఎన్నికల సంఘం అధికారులు దృష్టిసారించారు. ఆ సమాచారం తొలగించేందుకు



కేంద్ర ఎన్నికల సంఘంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కోసం ప్రత్యేక విభాగం ఏర్పాటు చేస్తామని వివరించారు. ఎన్నికలు జరిగే సమయంలో సోషల్ మీడియాలో తప్పుడు సమాచారం ఉంటే ఆ కంటెంట్ వెంటనే తొలగిస్తారని పేర్కొన్నారు. పార్టీ లేదంటే అభ్యర్థి నిబంధలను ఉల్లంఘిస్తే వారి అకౌంట్లను సస్పెండ్ చేయాలని, లేదంటే ఖాతా బ్లాక్ చేయాలని సోషల్ మీడియా ప్లాట్ ఫామ్‌లను కోరతామని తేల్చిచెప్పారు. తప్పుడు సమాచారంపై ప్రత్యేక దృష్టిసారిస్తారు. సున్నిత ప్రాంతాల్లో ఆ సమాచారం ప్రభావం ఎక్కువగా ఉంటుందని భావిస్తున్నారు. ఆ వార్త నిజమో, అబద్ధమో ఫ్యాక్ట్ చెక్ చేసి ప్రజలకు తెలియజేస్తామని స్పష్టం చేశారు.

## రాహుల్‌కు మతి చెడింది?


**లక్నో:** వారణాసిలో యువత మద్యం తాగి రోడ్డు మీద పడి ఉన్నారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తీవ్రంగా మండిపడ్డారు. ప్రధాని మోదీ వారణాసి లోక్‌సభ నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన ఓ సభలో పాల్గొని మాట్లాడారు. 'వాళ్లు నరేంద్ర మోదీని దశాబ్దాలుగా దూషిస్తున్నారు. కానీ ప్రస్తుతం వాళ్లు తమ అసహనాన్ని ప్రజల మీద చూపిస్తున్నారు. వాళ్లు కనీసం తెలివి లేకుండా ఉత్తరప్రదేశ్ యువతను మద్యం బానిసలు అంటూ నిందిస్తున్నారు. వారణాసి యువతపై రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నా' అని ప్రధాని మోదీ అన్నారు. రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో న్యాయ యాత్ర ఉత్తరప్రదేశ్‌లో కొనసాగుతున్న సమయంలో వారణాసిలో యువత మద్యం తాగి రోడ్డు మీద పడి ఉన్నారని వ్యాఖ్యానించారు. రాహుల్ వ్యాఖ్యలను ప్రధాని మోదీ తీవ్రంగా ఖండించారు.

'ప్రస్తుతం ఉత్తర ప్రదేశ్ అభివృద్ధి చెందుతోంది. కాంగ్రెస్ కుటుంబానికి చెందిన యువరాజు(రాహుల్ గాంధీ) యూపీ యువతను మద్యం బానిసలు అన్నారు. ఇదేం భాష. ఇండియా కూటమి యూపీ యువతను అవమానించిన తీరును ఎవరూ మర్చిపోరు. వారసత్వంగా వచ్చి ఆ వ్యక్తి(రాహుల్ గాంధీ) దేశంలోని సామాన్య ప్రజలకు ప్రమాదకారి. తెలివిలేనివారు మాత్రమే నా వారణాసి యువతను మద్యం బానిసలు అని పిలుస్తారు.

'వారణాసికి చెందిన యువత తాగి పడుకున్నారా..? అలా మాట్లాడిన వారికి మతి చెడింది. కాంగ్రెస్ యువరాజు తమ సొంత గడ్డకు చెందిన ప్రజలను అవమానించారు. అలా మాట్లాడటం తగదు. గత రెండు దశాబ్దాలుగా మోదీని తిడుతున్నారు. ఇప్పుడు వారి నిరాశ, నిస్పృహను వారణాసి యువతపై చూపిస్తున్నారు అని' మోదీ మండిపడ్డారు.

## దుబాయ్ వెళ్లే భారతీయులకు శుభవార్త - ఏంటో తెలుసా..

దుబాయ్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎకానమీ అండ్ టూరిజం భారత్.. దుబాయ్ మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేయడంలో భాగంగా ఐదేళ్ల మల్టిపుల్ ఎంట్రీ వీసాను ప్రవేశపెట్టింది. ఈ వీసా పొందిన వారు ఐదు సంవత్సరాల పాటు మల్టిపుల్ ఎంట్రీ, మల్టిపుల్ ఎగ్జిట్ సదుపాయాన్ని పొందుతారు.




భారత్ నుంచి 2023 సంవత్సరంలో ఏకంగా 2.46 మిలియన్ల మంది దుబాయ్ వెళ్లినట్లు, ఈ సంఖ్య కరోనా వ్యాపించడానికి ముందు రోజుల కంటే 25 శాతం ఎక్కువని తెలుస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా పరిశీలిస్తే 2023లో మొత్తం 17.15 మిలియన్ల మంది దుబాయ్ సందర్శించారు. 2022 ఇండియా నుంచి దుబాయ్ వెళ్లిన వారు 1.84 మిలియన్స్ కాగా.. 2019లో ఈ సంఖ్య 1.97 మిలియన్స్ మాత్రమే. ప్రపంచ వ్యాప్తంగా 2022లో దుబాయ్ వెళ్లిన పర్యాటకుల సంఖ్య 14.36 మిలియన్స్. అంటే ప్రపంచవ్యాప్తంగా 2022లో కంటే గత ఏడాది ఎక్కువ మంది దుబాయ్ సందర్శించినట్లు తెలుస్తోంది.

ఐదేళ్ల మల్టిపుల్ ఎంట్రీ వీసా అభ్యర్థన స్వీకరించిన తరువాత అన్ని విధాలా ఆమోదం పొందితే.. కేవలం 2 నుంచి 5 పనిదినాల్లో వీసా జారీ చేస్తారు. ఈ వీసా పొందిన తరువాత సంవత్సరంలో 180 రోజులు లేదా 3 నెలలు దుబాయ్‌లో ఉండవచ్చు. అయితే వారు ప్రతి 90 రోజులకు ఒకసారి అనుమతి పొందాల్సి ఉంటుంది. 180 రోజులు దుబాయ్‌లో ఉంటే రెండు సార్లు అనుమతి పొందాల్సి ఉంటుంది.

## రాహుల్ గాంధీని ఆ నియంతతో పోల్చిన హిమంత

**న్యూఢిల్లీ:** వీలు దొరికినపుడల్లా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీపై విరుచుకుపడే అస్సాం సీఎం హిమంత బిశ్వశర్మ తాజాగా మరోసారి ఆయనపై సంచలన వ్యాఖ్యలు చేశారు. రాహుల్‌గాంధీని హిమంత ఈసారి ఏకంగా ఉత్తర కొరియా నియంత కిమ్ జాంగ్ ఉన్‌తో పోల్చారు. ఈ మేరకు శు



క్రవారం ఎక్స్(ట్విటర్)లో ఆయన ఒక పోస్ట్ చేశారు. ముంబై యూత్ కాంగ్రెస్ మాజీ చీఫ్ బాబా సిద్ధికీ రాహుల్ గాంధీ టీమ్‌పై చేసిన బాడీ షేమింగ్ ఆరోపణలపై హిమంత స్పందించారు. నార్త్ కొరియా నియంత కిమ్ ఒక్కడే తనతో ఫొటో దిగే పార్టీ కార్యకర్తలు ఫొటోజెనిక్‌గా ఉండాలని కోరుకుంటారని హిమంత రాహుల్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. రాహుల్ గాంధీని కలవాలని వెళ్లిన తనను 10 కేజీల వెయిట్ తగ్గి రావాల్సిందిగా రాహుల్ టీమ్ సభ్యులు సూచించారని బాబా సిద్ధిఖీ చేసిన ఆరోపణలు సంచనం రేపాయి. కాగా, గత నెలలో అస్సాంలో రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర నిర్వహించిన సమయంలో హిమంత ప్రభుత్వం రాష్ట్రంలో యాత్రకు చాలా షరతులు విధించింది. గువహతిలోకి యాత్ర ప్రవేశించేందుకు వీలు లేకుండా ఆదేశాలు ఇచ్చింది. దీంతో కాంగ్రెస్ కార్యకర్తలకు, పోలీసులకు మధ్య ఘర్షణలు జరిగాయి. ఈ ఘర్షణలకు సంబంధించి రాహుల్‌గాంధీపై అస్సాం సీఐడీ కేసు కూడా పెట్టింది. త్వరలో ఈ కేసులో సీఐడీ రాహుల్‌కు సమన్లు ఇచ్చి విచారణకు పిలవనున్నట్లు తెలుస్తోంది.

# కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత మృతి

-మొదటి పేజి తరువాయి

పొందుతున్నాడు.


### నిద్రమత్తులోనే?

సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ సుల్తాన్‌పూర్ ఓఆర్ఆర్ వద్ద ఈ తెల్లవారు ఝామున దుర్ఘటన చోటు చేసుకుంది. మొక్కులు తీర్చుకునే క్రమంలో లాస్య తప్ప ఆమె కుటుంబ సభ్యులంతా గురువారం రాత్రి సదాశివపేట (మం) కొనాపూర్‌లోని మిస్కిన్ బాబా దర్గాకి వెళ్లారు. కాసేపటికే ఆకాష్‌తో పాటు లాస్య కూడా దర్గాకి వచ్చారు. లాస్య కుటుంబం అంతా రాత్రి 12.30 గంటలకు దర్గాలో పూజలు చేశారని అక్కడి నిర్వాహకులు చెబుతున్నారు. తిరిగి.. అర్ధరాత్రి ఒంటి గంట ప్రాంతంలో హైదరాబాద్‌కు లాస్య కుటుంబం పయనం అయ్యింది. మొక్కులు తీర్చుకున్న తర్వాత.. 3 నుంచి 4 గంటల మధ్య లాస్య కారు బయల్దేరిందని చెప్తున్నారు. అయితే.. పటాన్ చెరు వైపు ఎందుకు ఆమె వాహనం వెళ్లింది అనే దానిపై స్పష్టత రావాల్సి ఉంది. డ్రైవర్ సీట్‌లో ఉన్న వ్యక్తి నిద్రమత్తు, వాహన అతివేగం ప్రమాదానికి కారణాలైన ఉంటాయని పోలీసులు నిర్ధారణకు వచ్చారు. ముందు వెళ్తున్న వాహనాన్ని తప్పించే క్రమంలో సడన్ బ్రేక్ వేయడంతో కారు అదుపు తప్పి.. రెయిలింగ్‌ను బలంగా ఢీ కొట్టడంతోనే ప్రమాదం జరిగిందని భావిస్తున్నారు. ఆ సమయంలో లాస్య సీటు బెల్ట్ పెట్టుకోకపోవడం వల్ల అక్కడికక్కడే మృతి చెందారు.

### తల్లడిల్లిన తల్లి గుండె

ఈ ప్రమాదంలో కారు ముందు భాగం బాగా దెబ్బతింది. డ్రైవర్ పక్క సీట్లో కూర్చున్న లాస్య నందిత స్పాట్‌లోనే మృతి చెందారు. తీవ్రగాయాలైన ఆకాశ్‌ను మియాపూర్ మదీనగూడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. అతని పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. లాస్య నందిత మృతదేహాన్ని పటాన్‌చెరు అమెథా ఆస్పత్రికి తరలించారు. కూతురి మరణవార్త విని తల్లి స్పృహ తప్పి పడిపోయారు. మృతదేహాన్ని చూసి గుండెలు పగిలేలా రోదించారు. సోదరి నివేదితా రోదన పలువురిని కంటతడి పెట్టించింది. బీఆర్ఎస్ సీనియర్ హరీష్‌రావు ఆస్పత్రికి వెళ్లి లాస్య కుటుంబ సభ్యుల్ని ఓదార్చారు. గాంధీ ఆస్పత్రిలో లాస్య మృతదేహానికి పోస్ట్‌మార్టం నిర్వహించనున్నారు. అనంతరం కుటుంబ సభ్యులకు మృతదేహం అందజేస్తారు. ఇక.. యువ ఎమ్మెల్యే మృతి పట్ల బీఆర్ఎస్ వర్గాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి.

### సీఎం రేవంత్ దిగ్భ్రాంతి..



లాస్య నందిత అకాల మరణం తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఆమె కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. నందిత తండ్రి సాయన్నతో తనకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయని తెలిపారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు. అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించాలని అధికారుల్ని సీఎం రేవంత్ ఆదేశించారు. ఇక పలువురు మంత్రులు, కాంగ్రెస్ నేతలు సైతం లాస్య మృతిపై సంతాపం ప్రకటించారు. మంత్రి కోమటిరెడ్డి గాంధీ ఆస్పత్రికి వెళ్లి లాస్య కుటుంబాన్ని పరామర్శించారు. లాస్య మృతి బాధాకరమని.. ఎమ్మెల్యేగా ఆమె ప్రజలకు ఇచ్చిన హామీల్ని తమ ప్రభుత్వం నెరవేరుస్తుందని మంత్రి కోమటిరెడ్డి చెప్పారు.

లాస్య నందిత మృతిపై బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆమె కుటంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అతి పిన్న వయసులో ఎమ్మెల్యేగా ప్రజామన్ననలు పొందారని.. రోడ్డు ప్రమాదంలో అకాల మరణం ఎంతో బాధాకరమని పేర్కొన్నారు. ఆమె కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని చెప్పారాయన. బీఆర్ఎస్ నేతలు తలసాని, హరీష్‌రావు, కేటీఆర్, మల్లారెడ్డి.. తదితరులు లాస్య మృతిపై విచారం వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ కవిత లాస్య ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యుల్ని ఓదార్చారు. లాస్య అంత్యక్రియలు అయ్యేదాకా ఆమె కుటుంబ సభ్యులతోనే ఉండాలని బీఆర్ఎస్ అధిష్టానం కవితకు సూచించినట్లు తెలుస్తోంది.

### ఘటనపై పోలీసుల దర్యాప్తు

సికింద్రాబాద్ కంటోన్మెంట్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే లాస్య నందిత రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఆమె మృతిపై వివిధ కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. శుక్రవారం తెల్లవారుజామునే ప్రమాదం జరగ్గా.. ప్రాథమికంగా వచ్చిన అంచనాతో దర్యాప్తును ముందుకు తీసుకెళ్తున్నారు. ఈ క్రమంలోప్రమాద తీరును పోలీసు బృందాలు పరిశీలించాయి. త్వరలో కుటుంబ సభ్యులనూ పోలీసులు విచారించే అవకాశం ఉంది.

### ఫస్ట్ టైం ఎమ్మెల్యే..

లాస్య నందిత కంటోన్మెంట్ మాజీ ఎమ్మెల్యే సాయన్న కుమార్తె. గతేడాది ఫిబ్రవరిలో సాయన్న గుండె పోటుతో మృతి చెందారు. దీంతో ఆ స్థానంలో లాస్య నందితకు బీఆర్ఎస్ అధిష్టానం టికెట్ ఇచ్చింది. నవంబర్ చివర్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 17,169 ఓట్ల మెజారిటీతో ఆమె విజయం సాధించారు. రాజకీయంగా ఎంతో భవిష్యత్తు ఉందని భావిస్తున్న తరుణంలో.. అదీ చిన్న వయసులో లాస్య ఇలా దుర్మరణం చెందడం పట్ల పలువురు నేతలు తీవ్ర విచారం వ్యక్తం చేస్తున్నారు.

### 10 రోజుల కిందటే ప్రమాదం..

ఎమ్మెల్యేగా ఎన్నికయ్యాక లాస్య నందిత వరుసగా ప్రమాదాలకు గురయ్యారు. ఫిబ్రవరి 13వ తేదీన నల్లగొండలో కేసీఆర్ అధ్యక్షతన బీఆర్ఎస్ భారీ బహిరంగ సభ జరిగింది. ఎమ్మెల్యే లాస్య నందిత కూడా ఈ సభకు వెళ్లారు. ఆ సమయంలో ఆమె ప్రయాణిస్తున్న కారును నార్కట్‌పల్లి వద్ద ఓ టిప్పర్ ఢీకొట్టింది. దీంతో ఆమె వెళ్తున్న కారు ముందు టైర్ ఊడిపోయింది. ఈ ప్రమాదంలో ఎమ్మెల్యే లాస్య తలకు స్వల్ప గాయమైంది కూడా. అయితే ఆ సమయంలోనూ ఆకాషే(25) కారు నడిపినట్లు తెలుస్తోంది. అంతకు ముందు.. కిందటి ఏడాది డిసెంబర్‌లో ఓ కార్యక్రమానికి వెళ్లిన ఆమె మూడు గంటలపాటు లిఫ్ట్‌లో ఇరుక్కుపోయారు. సిబ్బంది అతికష్టం మీద లిఫ్ట్‌ను బద్ధలు కొట్టి ఆమెను, ఆమెతో పాటు ఉన్నవాళ్లను బయటకు తీశారు. తండ్రి సాయన్న చనిపోయిన ఏడాదికే.. ఇప్పుడు రోడ్డు ప్రమాదంలో లాస్య నందిత మృతి చెందడం గమనార్హం.

### కుటుంబ నేపథ్యం..

సాయన్న, గీతలకు లాస్య నందిత జన్మించారు. ఆమెకు ఇద్దరు సోదరీమణులు.. నమ్రతా, నివేదితా. లాస్య కంప్యూటర్ సైన్స్‌లో బీటెక్ చేశారు. లాస్య నందిత గతంలో కవాడిగూడ కార్పొరేటర్‌గానూ పని చేశారు. తండ్రి మరణంతో ఆమెకు బీఆర్ఎస్ సీటు ఇవ్వగా.. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి ఎన్ గణేష్‌పై 17 వేల ఓట్లకు పైగా ఆధిక్యంతో లాస్య గెలుపొందారు. ఏడాదికే.. ప్రజాప్రతినిధుల హోదాలోనే ఈ తండ్రీకూతుళ్లిద్దరూ మృతి చెందడంతో పలువురు దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు.

# త్వరలోనే రుణమాఫీ

**మేడారం :** ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో భాగంగా రూ.500కే గ్యాస్ సిలెండర్, తెల్లరేషన్ కార్డు ఉన్న ప్రతి పేదవానికి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇచ్చే కార్యక్రమాన్ని ఈ నెల 27వ తేదీన ప్రారంభించనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. కార్యక్రమానికి ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ ముఖ్య అతిథిగా హాజరవుతారని ముఖ్యమంత్రి వెల్లడించారు. రాష్ట్రంలో ఉన్న చిక్కుముడులు విప్పుతూ, ప్రజా సమస్యలు పరిష్కరిస్తున్నామని, ఇప్పటికే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రాజీవ్ ఆరోగ్య పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచామన్నారు. మేడారం మహా జాతర సందర్భంగా శ్రీ సమ్మక్క-సారలమ్మలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిలువెత్తు బంగారం (బెల్లం), పసుపు, కుంకుమ,గాజులు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతిహామీని అమలు చేస్తామన్నారు. రైతులకు ఇచ్చిన రూ.2లక్షల రుణమాఫీనిపై బ్యాంకులతో చర్చిస్తున్నామని, త్వరలోనే రైతులకు మంచి శుభవార్త చెప్పబోతున్నామని ముఖ్యమంత్రి అన్నారు. ఇప్పటికే మహిళలకు ఉచిత బస్సుప్రయాణం, రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.పది లక్షలకు పెంచామని గుర్తు చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతిహామీని అమలు చేస్తామని ముఖ్యమంత్రి పునరుద్ఘాటించారు. అధికారంలోకి వచ్చిన 60 రోజుల్లోనే 25 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని, 6,956 మంది స్టాఫ్ నర్సుల నియామకం, 441 సింగరేణి ఉద్యోగులు, 15 వేల పోలీసు, ఫైర్ డిపార్టుమెంట్ ఉద్యోగాలు భర్తీ చేశామని ముఖ్యమంత్రి తెలిపారు. మార్చి 2వ తేదీన మరో 6 వేలపైచిలుకు ఉద్యోగాలు భర్తీ చేయబోతున్నామన్నారు. రెండు లక్షల ఖాళీలు భర్తీ చేస్తామని చెప్పామో...దానికి తగినట్లు 25 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని, వాటిని ప్రజలకు కనిపించేలా.. కుళ్లుకుంటున్న వారికి వినిపించేలా ఎల్‌బీ స్టేడియంలో నే వేలాది మంది సమక్షంలో వారికి నియామక పత్రాలు ఇచ్చామని ముఖ్యమంత్రి తెలిపారు. ఉద్యోగాలు ఇచ్చినా ఇవ్వలేదంటూ మామాఅల్లుళ్లు,తండ్రీకొడుకులు తమ ప్రభుత్వంపై గోబెల్స్‌లా అబద్ధపు, తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. గ్రామీణ ప్రాంతాల్లో యువకులకు ఉద్యోగాలు కల్పించేందుకు పది స్కిల్ యూనివర్సిటీలు ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు.

### త్వరలోనే ప్రెస్ అకాడమీ ఛైర్మన్‌ను నియమిస్తాం...

త్వరలోనే ప్రెస్ అకాడమీ ఛైర్మన్‌ను నియమిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. తాము అధికారంలోకి వచ్చి వంద రోజులు కాలేదని, పదేళ్లు ఓపిక పట్టారని, త్వరలోనే జర్నలిస్టుల అన్ని సమస్యలు పరిష్కరిస్తామన్నారు. ప్రభుత్వాన్ని తేవడంతోనే జర్నలిస్టుల పని అయిపోలేదని కుట్రలు, కుతంత్రాలను తిప్పికొట్టడానికి సహకరించాలని ముఖ్యమంత్రి కోరారు. వాళ్లు ఇద్దరి (బీజేపీ-బీఆర్ఎస్‌ను ఉద్దేశించి) సమన్వయం మీకు తెలుసని, ఉదయం, సాయంత్రం మాట్లాడుకుంటున్నారని ముఖ్యమంత్రి తెలిపారు. పది సీట్లు బీజేపీకి, ఏడు సీట్లు కేసీఆర్‌కు మాట్లాడుకొని ఎన్నికలకు రాబోతున్నారని, ఆ చీకటి ఒప్పందాన్ని మీడియా మిత్రులు తిప్పికొట్టాలని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు.

× సమ్మక్క-సారలమ్మల స్ఫూర్తితో....

సమ్మక్క-సారలమ్మ ఆశీర్వాదంతోనే తెలంగాణ రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలో మంచి వర్షాలు పడి పాడిపంటలతో ప్రజలు విలసిల్లాలని, తెలంగాణలోని నాలుగు కోట్ల ప్రజలు సుఖశాంతులతో వర్ధిల్లాలని సమ్మక్క సారలమ్మను వేడుకున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. ఈ ప్రాంతంతో, ఈ ప్రాంత శాసనసభ్యురాలు, మంత్రి సీతక్కతో తనకున్న వ్యక్తిగత అనుబంధం.. రాజకీయంగా తామిద్దరం కలిసి చేసిన ప్రయాణం అందరికీ తెలుసని ముఖ్యమంత్రి అన్నారు. తాము ఏ ముఖ్య కార్యక్రమం తీసుకున్నాఇక్కడ సమ్మక్క-సారలమ్మ ఆశీస్సులు తీసుకొనే మొదలుపెట్టామన్నారు.

2023, ఫిబ్రవరి ఆరో తేదీన హాత్ సే హాత్ జోడోను ఇక్కడ నుంచే ప్రారంభించామని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. ప్రజా తీర్పు కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉంటుంది.. కాంగ్రెస్ ప్రభుత్వం, ప్రజా ప్రభుత్వ ఏర్పడుతుందని తాము ఆనాడే చెప్పామన్నారు. రాబోయే సమ్మక్క సారలమ్మ జాతరను భక్తులకు అసౌకర్యం కలగకుండా, అన్నిరకాల ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించి చేస్తామని ఆనాడే చెప్పామని, అలానే చేశామన్నారు. అమ్మల ఆశీస్సులతో సీతక్క, కొండా సురేఖ మంత్రులయ్యారని, తమందరికీ వివిధ హోదాలు, బాధ్యతలు వచ్చాయనన్నారు. ఆ బాధ్యతతోనే సుమారు ఒక కోటి యాభై లక్షల మంది భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగొద్దని, ఏర్పాట్లలో లోపం ఉండదనే ఉద్దేశంతో తమ ప్రభుత్వం రూ.110 కోట్లను జాతరకు కేటాయించిందని ముఖ్యమంత్రి తెలిపారు. ఎన్నికలు పూర్తికాగానే జాతరపై దృష్టి పెట్టాల్సి రావడంతో మంత్రులు సీతక్క, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాసరెడ్డిలను బృందంగా ఏర్పాటు చేసి సమన్వయంతో పనులు చేయించినట్లు చెప్పారు. ఆడ బిడ్డలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడమే తమ ప్రభుత్వ తొలి నిర్ణయమని, జాతరకు ఆడ బిడ్డలు పెద్ద ఎత్తున వస్తున్న నేపథ్యంలో ఆరు వేల ఆర్టీసీ బస్సులతో రవాణా సౌకర్యం ఏర్పాటు చేశామని, అన్ని డిపోల నుంచి బస్సులను ఇక్కడి పంపాలని ఆదేశించడంతో పాటు అదనంగా వంద కొత్త బస్సులు కొనుగోలు చేసి జాతరకు వాటిని వినియోగించామని ముఖ్యమంత్రి వెల్లడించారు. రాష్ట్రంలో 18 కోట్ల మంది ఆడ బిడ్డలు ఉచిత బస్సులు వినియోగించుకున్నారని, జాతరకు లక్షలాది మంది మహిళలు వచ్చేందుకు ఉచిత బస్సు ప్రయాణం ఉపయోగపడిందని ముఖ్యమంత్రి అన్నారు. సమ్మక్క-సారలమ్మ అంటేనే పోరాట స్ఫూర్తి అని, ప్రజలపై ఆధిపత్యం చలాయించాలనుకున్న, ప్రజలను పీడించైనా పన్నులు వసూలు చేయాలనుకున్న రాజులను పేదలు, ఆదివాసీ బిడ్డలైన తల్లీబిడ్డలు, తండ్రీ కొడుకులు అంతా కలిసికట్టుగా పోరాడారని ఆయన కొనియాడారు. బడుగుల, ఆదివాసీల పక్షాన కొట్లాడి నేలకు ఒరిగినందునే వందల సంవత్సరాలైనా సమ్మక్క సారలమ్మను దేవుళ్లుగా కొలుస్తున్నామని ముఖ్యమంత్రి అన్నారు. తమను నమ్ముకున్న ప్రజల కోసం నిలబడి పాలకులతో కొట్లాడినందుకు అమరులై వారు దేవతలుగా వెలిశారని ముఖ్యమంత్రి శ్లాఘించారు.

## వన దేవతలను దర్శించుకున్న సీఎం రేవంత్

**ములుగు:** మేడారంలో సమ్మక్క, సారలమ్మలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దర్శించుకున్నారు. అనంతరం మొక్కులు చెల్లించుకున్నారు. ఆసియాలో అతిపెద్ద గిరిజన పండుగ.. తెలంగాణ కుంభమేళాగా ఖ్యాతిగాంచిన మేడారం సమ్మక్క, సారలమ్మ మహా జాతరకు భక్తులు తండోపతండాలుగా తరలి వస్తున్నారు.నిన్న మేడారంలో కీలక ఘట్టం ప్రారంభమైంది. సమ్మక్క తల్లి గద్దెపై కొలువు దీరింది. సమ్మక్కను ప్రధాని పూజారి ప్రతిష్టించారు. వనదేవతల్ని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. సమ్మక్క, సారలమ్మలను గవర్నర్ తమిళిసై, కేంద్ర మంత్రి అర్జున్ ముండా, మంత్రులు సీతక్క, శ్రీధర్ బాబు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా తమిళిసై మాట్లాడుతూ, గవర్నర్‌గా మూడోసారి వచ్చానని, తెలంగాణ ప్రజలంతా సంతోషంగా ఆనందంగా ఉండాలని ప్రార్థిస్తున్నానన్నారు. సమ్మక్క సారలమ్మల పరాక్రమ పోరాటం గొప్పది. ఆరు గిరిజన గ్రామాలను దత్తత తీసుకున్నానని గవర్నర్ తెలిపారు. కేంద్ర మంత్రి అర్జున్ ముండా మాట్లాడుతూ, మేడారం జాతర గొప్ప జాతర అని, అమ్మ వార్లను దర్శించుకోవడం ఆనందంగా ఉందన్నారు.ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా గిరిజనులందరికి శుభాకాంక్షలు తెలిపారు. చిలకలగుట్టనుంచి సమ్మక్క తల్లి మేడారం గద్దెపైకి చేరడంతో మహాజాతర పరిపూర్ణత సంతరించుకుంది. ఇప్పటికే సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజులు గద్దెలపైకి చేరడంతో భక్తుల మొక్కులు జోరందుకున్నాయి. గురువారం రాత్రి చిలకలగుట్టనుంచి పూజారులు, వడ్డెలు సమ్మక్కను భక్తుల జయజయధ్వానాల నడుమ తీసుకొచ్చి గద్దెపై ప్రతిష్ఠించారు. దారిపొడవునా డోలు వాయిద్యాలు, ఆదివాసీల నృత్యాలు ఆకట్టుకున్నాయి. పూనకాలతో శివసత్తులు ఊగిపోయారు. జై సమ్మక్క.. జైజైసమ్మక్క.. తల్లీ శరణు.. జయహో జగజ్జనని.. సల్లంగాచూడు తల్లి అంటూ భక్తుల నామస్మరణ మార్మోగింది.

### గద్దెల వద్ద ప్రత్యేక పూజలు..

తెలంగాణ కుంభమేళా మేడారం జాతరలో ప్రధాన ఘట్టం సమ్మక్క ఆగమనం. తల్లిరాకతోనే జాతర సంపూర్ణమవుతుంది. కాగా, గురువారం మేడారంలోని సమ్మక్క గుడి శక్తిపీఠం వద్ద పూజారులు, వడ్డెలు సంప్రదాయ దుస్తులు ధరించి కుంకుమ, పసుపు, ఇతర పూజాసామగ్రిని పట్టుకొని గద్దెల వద్దకు చేరి ప్రత్యేక పూజలు చేశారు. సారలమ్మ, గోవిందరాజులు, పగిడిద్దరాజుకు పసుపు కుంకుమ అప్పగించిన తర్వాత పూజారులు చిలకలగుట్టకు చేరుకున్నారు.

## మలుపు తిరిగిన లిక్కర్ కేసు

-మొదటి పేజి తరువాయి

నోటీసులు ఇచ్చింది. అయితే గత నోటీసుల్లో ఆమెను సాక్షిగా పేర్కొన్న సీబీఐ... దాన్ని సవరిస్తూ ఇప్పుడు నిందితురాలిగా పేర్కొంది. ఈ పరిణామం బీఆర్ఎస్ శ్రేణులను కలవరపాటుకు గురి చేస్తోంది. గత డిసెంబర్ లో కవితను సీబీఐ విచారించింది. ఇప్పటి వరకు ఈడీ మూడు సార్లు విచారణ జరిపింది. అయితే సీబీఐ విచారణకు కవిత హాజరవుతారా? లేక కోర్టును ఆశ్రయిస్తారా? అనే విషయంలో ఆసక్తి నెలకొంది. గతంలో ఈ కేసులో కేవలం సాక్షిగా మాత్రమే ఉన్న కవిత... ఇప్పుడు నిందితురాలిగా మారడంతో కేసు విచారణ కీలక మలుపు తిరిగినట్టయింది.

## ఎమ్మెల్యే లాస్య నందిత భౌతిక కాయానికి నివాళులు అర్పించిన సీఎం రేవంత్ రెడ్డి

అవుటర్ రింగ్ రోడ్డుపై ఘోర ప్రమాదం

ఘటన స్థలిలోనే మృతి చెందిన కంటోన్మెంట్ ఎమ్మెల్యే నందిత

నందిత కుటుంబ సభ్యులను పరామర్శించిన సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్ అవుటర్ రింగ్ రోడ్డుపై జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో సికింద్రాబాద్ కంటోన్మెంట్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే లాస్య నందిత మృత్యువాత పడిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో, లాస్య నందిత భౌతిక కాయానికి సీఎం రేవంత్ రెడ్డి నివాళులు అర్పించారు. తీవ్ర విషాదంలో ఉన్న లాస్య నందిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అటు, మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కూడా లాస్య నందిత భౌతిక కాయానికి నివాళులు అర్పించారు.

### లాస్య నందిత మృతి ఘటనపై కేసు నమోదు

సుల్తాన్ పూర్ వద్ద ఓఆర్ఆర్ పై జరిగిన రోడ్డు ప్రమాదంలో లాస్య నందిత మృతిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ మృతి ఘటన తమ పోలీస్ స్టేషన్ పరిధిలోనే జరిగిందని పటాన్ చెరు పోలీసులు వెల్లడించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్టు తెలిపారు. పటాన్ చెరు వద్ద ఓఆర్ఆర్ నుంచి వెలుపలికి వచ్చే క్రమంలో ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు వివరించారు.

## కొనసాగుతున్నా అధికారుల బదిలీలు




-మొదటి పేజి తరువాయి

బాధ్యతలను అదనంగా అప్పగించింది. ఇంతకాలం ఆ బాధ్యతలు అదనపు హోదాలో చూస్తున్న సునీల్ శర్మను అక్కడి నుంచి రిలీవ్ చేసింది రాష్ట్ర సర్కార్. లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో భారీగా బదిలీలు చేస్తున్నారు. సుదీర్ఘకాలంగా ఒకేచోట పని చేస్తున్న వారికి ప్రభుత్వం స్థానచలనం కలిగిస్తోంది. వారిని వేర్వేరు స్థానాలకు బదిలీ చేస్తోంది. ఎన్నికలు సమీపించిన సమయంలో ఈసీ మార్గదర్శకాలకు అనుగుణంగా ఈ బదిలీలు సంభవిస్తుంటాయి. ఇటీవల డీఎస్పీలను కూడా పూర్తి స్థాయిలో మార్చారు. దీనికి కొనసాగింపుగా- ఎక్సైజ్ శాఖలో బదిలీలకు పూనుకుంది ప్రభుత్వం. ముమ్మందు ఐఎఎస్, ఐపీఎస్ స్థాయి అధికారుల బదిలీలు కూడా ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. వచ్చే నెల పదో తేదీలోపున ఎన్నికల షెడ్యూల్ వచ్చే అవకాశం ఉంది. ప్రభుత్వం మారిన తర్వాత రేవంత్ రెడ్డి సర్కార్ భారీగా అధికారుల బదిలీలు చేపట్టలేదు. సీఎస్‌గా బీఆర్ఎస్ హయాంలో నియమితలైన శాంతికుమారినే కొనసాగిస్తున్నారు. ఎన్నికల సంఘం డీజీపీగా రవిగుప్తాను నియమించడంతో ఆయననే కొనసాగిస్తున్నారు. బదిలీలు రాజకీయ పరమైనవి కావని.. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు.. నిబంధనల మేరకు బదిలీలు చేస్తున్నారని అధికార వర్గాలు అంటున్నాయి. విధుల్లో నిర్లక్ష్యంగా ఉన్న వారిని కూడా బ దిలీ చేస్తున్నట్లుగా తెలుస్తోంది. జిల్లాలకు అత్యంత ముఖ్యమైన కలెక్టర్ల విషయంలో రేవంత్ రెడ్డి అత్యంత సమర్థులైన వారికే పోస్టింగ్ లు ఇవ్వాలని సీఎస్‌కు సూచిస్తున్నట్లుగా తెలుస్తోంది.

## కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేది లేదు చచ్చేది లేదు

-మొదటి పేజి తరువాయి



ఆరోపించారు. దేశంలో సకల సమస్యలకు కాంగ్రెస్ కారణమన్నారు. ఆర్టికల్ 370 ని రద్దుతో కశ్మీర్‌లో జాతీయ జెండా రెపరెపలాడుతోందన్నారు. 500 ఏళ్ల క్రితం నాటి అయోధ్య సమస్యను కేంద్ర ప్రభుత్వం శాంతి యుతంగా పరిష్కరించి, రామ మందిరాన్ని నిర్మించిందని తెలిపారు. 370 పార్లమెంటు స్థానాలు బీజేపీకి రాబోతున్నాయని ధీమా వ్యక్తం చేశారు. అందులో పెద్దపల్లి పార్లమెంటు నియోజకవర్గం కూడా ఉండాలన్నారు. పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ అనేక అవినీతి అక్రమాలకు పాల్పడిందని విమర్శించారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ వల్ల ప్రజలకు కలిగే ప్రయోజనం ఏమీ ఉండదని కిషన్‌రెడ్డి వ్యాఖ్యలు చేశారు.

### కేసీఆర్ పాపాల ఫలితమే బీఆర్ఎస్ ఓటమి..

కొమురం భీం: బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కుటుంబ పాలన ఖతమైందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పేర్కొన్నారు. నేడు బీజేపీ విజయ సంకల్ప యాత్రలో కిషన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ పాపాల ఫలితంగానే బీఆర్ఎస్ ఓడిపోయిందన్నారు.

ఫామ్ హౌస్‌కు వెళ్లి కాలు విరగొట్టుకున్నాడన్నారు. బీఆర్ఎస్ పార్టీకి ఓటేస్తే వృథా అవుతుందన్నారు. ఆ పార్టీ ఒక్క ఎంపీ సీటు గెలిచినా.. తెలంగాణకు లాభం లేదని.. గెలవకున్నా రాష్ట్రానికి నష్టం ఉండదన్నారు. మోసపూరిత కాంగ్రెస్ ను కూడా నమ్మొద్దని.. అవినీతి కి చిరునామా ఆ పార్టీ అని కిషన్ రెడ్డి పేర్కొన్నారు.

## సంపాదకీయం

# దిగజారిన జపాన్ జీడీపీ!

ఐదు దశాబ్దాల క్రితం అమెరికాను వెనక్కు నెట్టేసి ఆర్థికంగా మొదటి స్థానంలో ఉంటుందని అనేక మంది భావించిన జపాన్ 2010లో చైనా ముందుకు రావ టంతో మూడవదైంది. తాజాగా ఆ స్థానాన్ని కూడా కోల్పో యి జర్మనీ తరువాత నాల్గవదిగా మారింది. జర్మనీ జీడీపీ నాలుగున్నర లక్షల కోట్ల డాలర్లు కాగా జపాన్ 4.2లక్షల కోట్లకు పడిపోయింది. జర్మనీ పరిస్థితి కూడా అటూ ఇటూగా ఉంది, అక్కడ కూడా ఆర్థిక వృద్ధి అనుమానంలో పడింది. ఎక్కడైనా వరుసగా రెండు త్రై మాస కాలాల్లో జీడీపీ తిరోగమనంలో ఉంటే ఆ దేశం సాంకేతికంగా మాంద్యం లోకి దిగజారినట్లు భావిస్తారు. గతేడాది చివరి ఆరు నెలల్లో జపాన్‌లో అదే జరిగింది. ఈ కారణంగానే జీడీపీ లో తన స్థానాన్ని కోల్పోయింది. గురువారం నాడు జపాన్ విడుదల చేసిన సమాచారం ప్రకారం 2023 జూలై– సెప్టెంబరు మాసాల్లో జీడీపీ వృద్ధి రేటు 0.8, తరువాత మూడు మాసాల్లో 0.1శాతం తిరోగమనంలో ఉన్నట్లు ద్రవ్యోల్బణాన్ని పరిగణనలోకి తీసుకొని లెక్క లను ఖరారు చేశారు. గడచిన రెండు మూడు దశాబ్దా లుగా పక్షవాత రోగి మాదిరిగా ఉన్న అక్కడి అర్థిక వ్యవస్థ తీరుతెన్నులను చూస్తున్న వారికి ఇది ఆశ్చర్యం కలిగిం చదు. జీడీపీ లెక్కింపులో జనాన్ని గందరగోళపరుస్తారు. నామమాత్ర జీడీపీ వేరు, వాస్తవ జీడీపీ వేరు. నామ మాత్రం అంటే వర్తమానం, తాత్కాలికమైనది. వాస్తవం అంటే ఒక సంవత్సరాన్ని ప్రాతిపదికగా తీసుకొని తరు వాత కాలంలో ఆ దేశ కరెన్సీ విలువ తగ్గిందా, పెరిగిందా అన్న అంశాన్ని తీసుకొని ఖరారు చేసేది. ఉదాహరణకు 2010లో ఒక దేశ జీడీపీ వంద అనుకుంటే పదేండ్ల తరువాత 150కి పెరిగిందంటే 50శాతం వృద్ధి కనిపి స్తుంది. కానీ ఈ కాలంలో ఆ దేశ కరెన్సీ విలువ 50 శాతం పడిపోతే పదేండ్ల తరువాత నిజవిలువ 75 మా త్రమే. జపాన్ లెక్కలు కూడా అలాంటివే, 2023లో 1.9 శాతం వృద్ధి రేటు నమోదైనట్లు గతంలో ప్రకటించారు. కానీ దిగజారిన కరెన్సీ ఎన్ విలువ, ఇతర అంశాలను పరిగణనలోకి తీసుకొని ఆరునెలల కాలంలో తిరోగమన వృద్ధి నమోదైనట్లు ప్రకటించటంతో డాలర్ లెక్కల్లో జర్మ నీ కంటే జపాన్ జీడీపీ విలువ తగ్గినట్లు పరిగణించాల్సి వచ్చింది. మన దేశంలో కూడా నామమాత్ర జీడీపీ లెక్కలను చూపి కేంద్ర ప్రభుత్వం తమ ఘన త చూడమని చెబుతున్నది, కానీ కొందరు ఆర్థి కవేత్తలు నిజ జీడీపీ విలువ గురించి నిల దీయటంతో నామమాత్ర జీడీపీనే పరిగణనలోకి తీసు కోవాలని మోడీ ప్రభుత్వం దబాయిస్తోంది. జపాన్, జర్మనీ రెండవ ప్రపంచ యుద్ధంలో ఓడి పోయిన తరువాత ఆ దేశాలలో మరోసారి మిలిటరీ నియంతలు తలెత్తకుండా ఉండేందుకు ఆత్మరక్షణ దళా లను మాత్రమే నిర్వహించాలని ఒప్పందాలు జరిగాయి. అందువలన మిలిటరీ ఖర్చును అక్కడి ప్రభుత్వాలు పరిశోధన–అభివృద్ధికి వెచ్చించటంతో రెండు దేశాలు కూడా పారిశ్రామిక, ఎగుమతి రంగాల్లో దూసుకు పోయాయి. ఇటీవలి కాలంలో చైనా పెరుగుతున్న కొద్దీ జపాన్ నామమాత్ర వృద్ధితో కొట్టుమిట్టాడుతోంది. ఎగు మతులు బాగా చేసిన కాలంలో సంపాదించుకున్న డాలర్ల మిగులు ఇప్పటికీ ఎంతో ఉంది కనుక ఆ మాత్ర మైనా నిలిచి ఉంది. డాలరుతో పోలిస్తే జపాన్ కరెన్సీ ఎన్ విలువ గత రెండేండ్లుగా పతనం అవుతున్నది. అందుకే వాస్తవ జీడీపీ విలువ తగ్గుతున్నది. స్థానికంగా జనాలు చేస్తున్న ఖర్చు కూడా తగ్గుతున్నది, పని చేసేం దుకు కార్మికులు లేకపోవటంతో విదేశాల నుంచి దిగు మతి చేసుకుంటున్నారు. మహిళలను మరింతగా ఉత్పాదక రంగంలోకి దించేందుకు వేతనాల పెంపుదల వంటి కొన్ని చర్యలు తీసుకుంటున్నప్పటికీ వృద్ధి రేటు మెరుగుపడకపోగా దిగజారుతు న్నది. అభివృద్ధి చెందిన అన్ని దేశాల్లో జన నాల రేటు తగ్గి కార్మిక శక్తి కొరత, వృద్ధుల సంఖ్య పెరుగుతున్నది. ఇంతకాలం రష్యా చౌక ఇంధనం మీద ఆధారపడిన జర్మనీ ఇప్పుడు ఉక్రెయిన్ సంక్షోభంతో ఇబ్బందుల్లో పడింది. జపాన్, జర్మనీలో ఎగుమతుల మీద ఆధారపడిన వ్యవస్థలుగా వృద్ధి చెందాయి. ఇప్పుడు అనేక దేశాల్లో ఏర్పడిన మంద గమనంతో పాటు, చైనా అన్ని రకాల వస్తువు లను చౌకగా ఎగుమతి చేస్తుండటంతో ఎగు మతి ఆధారిత వ్యవస్థలన్నీ ఇబ్బందులను ఎదు ర్కొంటున్నాయి. జపాన్ ఎగుమతులు గత కొద్ది సంవత్సరాలుగా తగ్గుతున్నాయి. గతం లో ప్రపంచ మార్కెట్లో ఎక్కడ చూసినా జపాన్ టీవీలు, కంప్యూటర్లు, కార్లు కనిపించేవి. ఇప్పుడు చైనా వాటి స్థానాన్ని ఆక్రమించింది. ఇది ఒక్క జపాన్ సమస్య మాత్రమే కాదు, పెట్టుబడిదారీ విధానాలను అనుసరిస్తున్న అన్ని సమాజాలు ఎదుర్కొం టున్న సంక్షోభమే ఇది.

# ఆరోగ్యాలను హరిస్తున్న జంక్ ప్రాసెస్డ్ ప్యాకేజ్ ఫుడ్స్!



డిజిటల్ యుగపు మానవుడి జీవనశైలిలో పను మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ప్రతికూల ఆహారపు అలవాట్లు, శారీరక శ్రమ కరువు కావడం, కూర్చొని గంటల తరబడి పని చేయడం, అర్థ రాత్రి వరకు మెలకువగా ఉండడం, స్మార్ట్‌ఫోన్ దుర్వసనాలకు లోనుకావడం లాంటివని సర్వసాధారణం అయ్యాయి. వీటికి తోడుగా శీతలపానీయాలు/మద్యం విచ్చలవిడిగా సేవించడం, పొగ తాగడం, జంక్/ప్యాకేజ్ ఫుడ్స్‌ను లొట్టలేసుకుంటూ తినడం లాంటి అలవాట్లు నేటి ఆధునిక యువత జీవనశైలిలో భాగాలు అవుతున్నాయి. బ్రెడ్స్, ఫ్రోజెన్ మీల్స్, బేక్డ్ పదార్థాలు, చీజ్, చిప్స్, చాకోలెట్స్, క్యాండీ,ఐస్ క్రీమ్స్, నూడుల్స్, సూప్స్, మీట్, సూసులు, నగెట్స్, ఫింగర్స్, సోడా ఉత్పత్తులు, శీతలపానీయాలు, ఫ్రోజెన్ ఫుడ్స్ లాంటివి ప్రాసెస్టీడ్ ప్యాకేజ్డ్ ఫుడ్స్ జాబితాలోకి వస్తాయి. ఇటీవలి అధ్యయనాల ప్రకారం 30 బ్రెవరేజ్ ఫుడ్స్ తయారు చేస్తున్న 1,306 ప్యాకేజ్ ఫుడ్స్‌లో 95 శాతం వరకు ఆరోగ్యాన్ని హరించే ఆహార పదార్థాలే ఉన్నట్లు తేలింది. ఇలాంటి ఆహార పదార్థాల్లో డబ్ల్యూహెచ్‌ఓ సిఫార్సు చేసిన మోతాదుకు మించి హానికారక పదార్థాలు ఉన్నట్లు తేలడం ప్రమాద హెచ్చరికగా తీసుకోవాలి. ఇలాంటి ఉత్పత్తుల్లో 62 శాతం వరకు మూడు లేదా అంత కన్న ఎక్కువ న్యూట్రిషన్ కాంపొనెంట్స్ మోతాదులు అధికంగా ఉన్నాయని అధ్యయనాలు తెలియజేస్తున్నాయి.

ప్రస్తుతం మార్కెట్‌ను ప్రాసెస్డ్ ప్యాకేజ్ ఫుడ్స్ ముంచెత్తుతున్నాయి. నేటి యువత ఇలాంటి హానికారక ఫుడ్ ప్యాకెట్స్‌ను మితిమీరి తినడం సర్వసాధారణం అయ్యింది. ప్రాసెస్డ్ ప్యాకేజ్ ఫుడ్స్‌లో మోతాదుకు మించి ఉప్పు, షుగర్, లేదా కొవ్వులు ఉంటున్నాయనే వాస్తవాలను నిపుణులు వెల్లడిస్తున్నారు. ఇలాంటి ప్యాకేజ్ ఫుడ్స్‌పై మోతాదుకు మించి ఉన్న పోషకాల వివరాలను హెచ్చరికలుగా ముద్రించే విధంగా చర్యలు తీసుకోవాలని పిల్లల వైద్యులు, పోషకాహార నిపుణులు, ప్రజారోగ్య సంస్థలు, వినియోగదారుల సంఘాలు లాంటి స్వచ్ఛంద సంస్థలు ప్రభుత్వాన్ని కోరుతున్నాయి. "న్యూట్రిషన్ అడ్వకసీ ఇన్ పబ్లిక్ ఇంటరెస్ట్, ఎన్ఏపిఐ" వివరాల ప్రకారం డిజిటల్/ప్రింట్ మాధ్యమాల్లో ప్యాకేజ్ ఫుడ్స్‌ను ప్రోత్సహించే ప్రకటనల్లో అమితాబ్ లాంటి సెలబ్రీటీలను వాడుకోవడం కూడా తప్పుదారి పట్టించే విధంగా ఉంటున్నాయని కూడా పేర్కొంటున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ వివరాల ప్రకారం ప్రతి నెల 10 ప్రముఖ టీవీ చానెల్స్‌లో 2 లక్షలకు పైగా ప్యాకేజ్ ఫుడ్స్‌కు సంబంధించిన ఆకర్షణీయ ప్రకటనలు వెల్లువెత్తుతున్నట్లు తెలుస్తున్నది. ఇలాంటి ప్రకటనలపై ప్రభుత్వ ప్రమేయం లేకపోవడం విచారకరం. జంక్, ప్రాసెస్డ్ ఫుడ్ ప్యాకెట్లపై "మోస్ట్ ఇంపార్టెంట్ ఇన్‌ఫర్మేషన్" అనబడే పూర్తి సమాచారం ఉండాలంటూనే మోతాదుకు మించి ఉప్పు, చక్కెరలు, సంతృప్త కొవ్వులు, ప్రమాదకర కృత్రిమ రసాయనాలు ఉన్నట్లు ముఖ్య సమాచారం ముద్రించాలని ఏన్ఏపిఐతో పాటు పౌర సమాజం కూడా కోరుకుంటున్నది.

అల్ట్రా ప్రాసెస్డ్ ప్యాకేజ్ ఫుడ్స్, జంక్ ఫుడ్స్‌లో మోతాదుకు మించి చక్కెరలు, ఉప్పు, సంతృప్త కొవ్వులు ఉంటున్నాయని – ఇలాంటి ఆహార పదార్థాలను అతిగా తీసుకున్నపుడు స్థూలకాయం, మధుమేహం లాంటి జీవనశైలి రుగ్మతలు కలుగుతున్నాయని తేల్చారు. నేటి భారతంలో అధ్యయనం చేసిన 6 శాతం మంది 5 ఏండ్ల లోపు బాలల్లో 43 లక్షల మంది అధిక బరువు లేదా స్థూలకాయ బారిన పడ్డారని తేల్చారు. అల్ట్రా ప్రాసెస్డ్ ఫుడ్ తరుచుగా అధిక మోతాదులో తీసుకునే అలవాటు ఉన్న వారిలో క్యాన్సర్ ప్రమాదం పెరుగుతుందని తేలింది. ప్రాసెస్డ్ ఫుడ్ 10 శాతం వరకు వినియోగం పెరిగితే వారిలో 12 శాతం క్యాన్సర్ రిస్క్ పెరుగుతుంది. అధిక ఉప్పు, కొవ్వులు తీసుకున్నపుడు మధుమేహం, అధిక బిపీ, స్థూలకాయం, గుండెజబ్బులు, ఆకలి మందగించడం, జీర్ణ వ్యవస్థ రుగ్మతలు, ఎముకల బలహీనతలు, నీరసం, చర్మ సమస్యలు, దంతాల్లో రంధ్రాలు, కాలేయ వ్యాధులు, కిడ్నీ సమస్యలు, అధిక కొలెస్టారాల్ లాంటి అనారోగ్యాలు పెరుగుట గమనిస్తున్నాం. ప్రాసెస్డ్ ఫుడ్స్‌లో శరీర ఎదుగుదలకు అవసరమైన పీచు పదార్థాలు, విటమిన్లు, ఖనిజ లవణాలు తక్కువగా ఉంటున్నాయి.

ఇలాంటి ఆహార పదార్థాలు తొందరగా జీర్ణ కావడంతో ఆ కాలనీలను వినియోగించడానికి వీలు చిక్కక బరువు పెరగడం కనిపిస్తుంది. ప్రాసెస్డ్/జంక్ ఫుడ్స్‌లో దాదాపు 5,000 వరకు కలరింగ్, టెక్చరింగ్, ఫ్లేవరింగ్, సువాసనకు సంబంధించిన అడిటివ్స్, ప్రజర్వేటివ్స్ లాంటి కృత్రిమ రసాయనాలు కలుపుతున్నారనితెలుసు కోవాలి. ఇలాంటి రసాయనాల దుష్ప్రభావాలను ఇప్పటి వరకు ప్రభుత్వాలు శాస్త్రీయ అధ్యయనం చేయకపోవడం సోచనీయం. అదే పనిగా చక్కెర బుక్కితే చక్కర రుగ్మత వస్తుందని, ఉప్పు ఎక్కువ తింటే రక్తపోటుకు దారులు బారుగా తెరుచుకుంటాయని, లొట్టలేసుకుంటూ కొవ్వులు ఆరగిస్తే ఒళ్లంతా కొవ్వెక్కుతుందని తెలుసుకుందాం, మన ఆరోగ్యాన్ని మనమే కాపాడుకుందాం. దుకాణాల్లో వెలసిన ప్యాకెట్ ఫుడ్స్ నోటిని ఊరిస్తూ నిశ్శబ్దంగా మన ఆరోగ్యాలను హరిస్తున్నాయని తెలుసుకుందాం. అమ్మ వండిన వంట ఆరోగ్య సద్దన్నం మూట అని, బజారు ఆహారపు పొట్లాలు ఆరోగ్యానికి తూట్లు పొడిచే గరళ కత్తులని తెలుసుకుందాం. అమ్మ చేతి వంట సమస్త ఆరోగ్య సంరక్షణకు ఔషధాల మూట అని నమ్ముదాం.

# కనీస మద్దతు ధర రైతు హక్కు!



స్వాతంత్రం సిద్ధించిన తర్వాత గరీబి హటావో నినాదంతో, హరిత విప్లవం దిశగా దేశాన్ని ముందుకు నడిపి దేశంలో పంటల ఉత్పత్తులను పెంచడంలో సఫలీకృతమైన ప్రభుత్వాలకు పంటకు కనీస మద్దతు ధర ఇవ్వడం ఎందుకు సాధ్యం అవడం లేదన్నది ప్రశ్న. పంటలకు కనీస మద్దతు ధర ప్రభుత్వ బిక్ష కాదు, అది రైతుల హక్కు అని అర్థం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మన దేశం వ్యవసాయ ఆధారిత దేశం. కానీ కార్పొరేటీకరణ ప్రభావం ఇప్పుడు అన్ని రంగాలపై ఉంది. పైగా స్వాతంత్రం సిద్ధించినప్పటి నుంచి వ్యవసాయ దారుల హక్కులను హరిస్తూ, వారి ఉత్పత్తులకు కనీస మద్దతు ధర లేకుండా వారిని నిత్యం వ్యధల్లో ముంచెత్తుతున్నారు. దీంతో రైతులు చట్టబద్ధమైన హక్కులనూ పొందడం లేదు. అనేక ఆందోళనలు, కమిషన్ల రిపోర్టుల ద్వారా చెరుకు, పత్తి లాంటి ఇతర వాణిజ్య పంటలకు మద్దతు ధర కల్పించడంలో ప్రభుత్వాలు కొంత సఫలీకృతమైనప్పటికీ వరి, మొక్కజొన్న, గోధుమ లాంటి నిత్యావసర వస్తువులకు మద్దతు ధర ప్రకటించడంలో ప్రతిసారి విఫలమౌతూ వస్తున్నాయి. ధర హామీలేని కారణంగా రైతులలో నిరాశ, నిస్పృహలు రోజురోజుకు పెరిగిపోయి కుటుంబాలకు, కుటుంబాలు ఆత్మహత్యలు చేసుకునే దుస్థితి మన దేశంలో ఉంది.

కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) పేరిట వ్యవసాయ ఉత్పత్తులకు ధర కల్పించాలనే ఆలోచన 1966 నుంచి భారతదేశంలో వెలుగులోకి వచ్చింది. ప్రస్తుతం 23 వ్యవసాయ ఉత్పత్తులకు కనీస మద్దతు ధరను ప్రతి సీజన్లో భారత ప్రభుత్వం ప్రకటిస్తోంది. కొన్ని పంటలకు తప్ప మిగతా పంటలకు కనీస మద్దతు ధర ప్రకటన ఆలస్యమై రైతులకు ప్రతిసారీ నిరాశనే ఎదురవుతోంది. భారతరత్న డాక్టర్ స్వామినాథన్ సారథ్యంలో 2004 నవంబర్‌లో రైతుల స్థితిగతులపై నియమించిన జాతీయ కమిషన్ తన ఆరు నివేదికలలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, ముఖ్యంగా వారి మద్దతు ధర విషయంపై కూలంకుషంగా సూచనలు చేసినప్పటికీ ప్రభుత్వం రైతు ఉత్పత్తులకు ప్రకటించే కనీస మద్దతు ధర మాత్రం ఆశించిన స్థాయిలో పెంచడం జరగలేదు. ఞా2 (పంట పండించడం కోసం పెట్టిన పెట్టుబడి ఖర్చులు, పంట సాగు కోసం చేసిన ఖర్చు), ఖీమ లేబర్ ఖర్చులను మాత్రమే పరిగణనలోకి తీసుకొని కనీస మద్దతు ధర నిర్ణయం జరుగుతోందని, ఇది ఏ మాత్రం రైతుకు లాభసాటిగా లేదని, జ2( స్థిరాస్తిపై చేసిన ఖర్చు)ను కూడా పరిగణనలోకి తీసుకుని ధర నిర్ణయం చేయాలని స్వామినాథన్ కమిషన్ సూచించింది. కానీ ఇప్పటివరకు ప్రభుత్వం ఏ సూత్రం ప్రకారం ధర నిర్ణయం చేస్తుందో ఎక్కడా వెల్లడించలేదు. ప్రభుత్వం నిర్ణయించే ధరకు... రైతులు, రైతు సంఘాలు అంచనా వేస్తున్న ధరకూ ఏమాత్రం దగ్గరి సంబంధం కూడా లేదు. ప్రభుత్వాలు ప్రకటించిన మద్దతు ధర సరిపోక అనేక ఆందోళనలకు రైతులు దిగుతున్నారు.

పంట మార్పిడి విధానం ద్వారా రైతులు మద్దతు ధర పొందవచ్చు అనే ఆలోచనలను ప్రభుత్వం ముందుకు తీసుకొస్తున్నప్పటికీ ఇది కష్టమే అని నిరూపితం అవుతూ వస్తోంది. నిత్యావసర వస్తువులైన పప్పు దినుసులు, జీలకర్ర, అల్లం పంటను విత్తే సమయానికి ఉన్న ధరతో పోలిస్తే, పంట చేతికొచ్చే సమయానికి ఉన్న ధర సగానికి సగం పడిపోతోంది. ఎటువంటి ధర హామీ లేకుండా రైతులు పంట మార్పిడి చేయడం కారణంగా మరింత నష్టపోయిన ఘటనలు అనేకం, రైతులు పంట మార్పిడికి సుముఖత చూపకపోవడానికి ఇదే ముఖ్య కారణంగా మనం అర్థం చేసుకోవచ్చు. పంటకు ప్రభుత్వం విధించిన మద్దతు ధర కంటే వ్యాపారులే ఎక్కువ డబ్బులు ఇచ్చి పంటను కొనే స్థాయిలో ధర నిర్ణయం జరుగుతోంది. అంటే రైతులకు ఇచ్చే కనీస మద్దతు ధర, వారికి వచ్చే లాభాన్ని మనం అంచనా వేయవచ్చు. రైతులను పంట మార్పిడికి ప్రోత్సహించే పాలనా వ్యవస్థ కిందిస్థాయి వరకు లేకపోవడం దురదృష్టకరం.

స్వాతంత్రం సిద్ధించిన తర్వాత వ్యవసాయ చట్టాల్లో మార్పులు లేకపోవడం, వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ కమిటీ నియంత్రణ ఎక్కువ అవ్వడం... లిబరలైజేషన్, గ్లోబలైజేషన్ తర్వాత కూడా రైతులకు ధరల హామీ కల్పించకపోవడం వంటివే రైతుల అసహనానికి కారణం. చెరుకు పంటకి చట్టబద్ధత కల్పించడంలో 1966లో ప్రభుత్వం సఫలమైంది కానీ మిగతా పంటల విషయంలో కూడా ప్రభుత్వం ఆలోచన చేసి తగు నిర్ణయం తీసుకుంటే బాగుంటుంది. దేశ రాజధానిలో ఆందోళన చేస్తున్న రైతులతో ప్రభుత్వం అనేకసార్లు చర్చలు జరిపినా సమస్య ఒక కొలిక్కి రావడం లేదు. ఆందోళనల తీవ్రతను చూస్తుంటే ఎన్నికల వేళ రైతులు తమ ఆందోళనలు మరింత ఉధృతం చేసే అవకాశాలు లేకపోలేదు. 2014లో ఏర్పాటైన నరేంద్ర మోడీ ప్రభుత్వం గత ప్రభుత్వాల కంటే కనీస మద్దతు ధర పెంచుతూ వస్తున్నప్పటికీ ప్రస్తుతం ఉన్న ఖర్చుల దృష్ట్యా రైతులు జీవనం సాగించడం రోజురోజుకు కష్టతరమవుతుంది. కనీస మద్దతు ధర ప్రభుత్వ బిక్ష కాదు, అది రైతుల హక్కు అని అర్థం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## కులగణనతోనే.. సామాజిక న్యాయం సాధ్యం!

ఇప్పుడు దేశంలో ప్రధాన చర్చల్లో కులగణన ఒక ప్రధానాంశంగా నిలిచింది. ఈ మధ్యకాలంలో దేశంలో కులగణన చేయాలని మెజారిటీ ప్రజలు కోరుకుంటే కొందరు కుహనా మేధావులు మాత్రం దీనికి వ్యతిరేకంగా మాట్లాడుతున్నారు.వాదనకు నిలబడని రాతలు రాస్తూ చర్చల్లో నిల్చుంటున్నారు. సాక్షాత్తు ఈ దేశ ప్రధానమంత్రి తాను ఓబీసీ సామాజిక వర్గానికి చెందినవాడినని వేదికలమీద ప్రకటించారు. కానీ ఇప్పుడు అదే ఓబీసీల ప్రధాన డిమాండ్ అయిన కులగణన అంశం వచ్చేవరకు ఇది దేశాన్ని కులపరంగా విభజనకు దారితీస్తుందని వాపోతున్నారు.మనిషి ఎంత విజ్ఞానవంతుడైనా కులం తోకలు ఇంకా తొలగిపోత లేవు. కులం ఓ సామాజిక గుర్తింపుగా ఉంది. అగ్రవర్ణాలకు కులం సామాజిక విలువగా ఉంటే, కింది వర్గాలకు అదే కులం సామాజిక వివక్షగా ఉందనడంలో ఎలాంటి సందేహం లేదు. కులం భారతీయ సమాజంలో ఉత్పత్తి ప్రక్రియకు సంబంధించిన సామాజిక శ్రమ విభజన. ఇప్పటి సమాజంలో రాజకీయ పార్టీలు, పెద్ద కంపెనీలు, మీడియా రంగం, ఇతర సేవారంగం, ఏదైన ఉదాహరణకు తీసుకొండి అన్నీ రంగాలలో ఆధిపత్యం ఆధిపత్యపు కులాలదే ఉంటది. ప్రతిభ అందరి సొత్తు అయినప్పుడు ఈ వెలివేతల మాటేమిటన్నది అంతుచిక్కని ప్రశ్న. తెలంగాణ శాసనసభ ఓ చారిత్రక ఘట్టానికి అడుగులు వేసింది. జనాభా దామాషా ప్రకారం తమ వాటా తమకు కల్పించాలంటూ బీసీ సమాజం దశాబ్దాలుగా చేస్తున్న పోరాటం మేరకు సమగ్ర కుల గణన చేపట్టాలని ఇతర రాష్ట్రాలతో పాటు మన తెలంగాణ కూడా నడుం కట్టింది. రాష్ట్రంలో ప్రజలందరి వాస్తవ స్థితిగతులు వారి వివరాలను శాస్త్రీయంగా సేకరించేందుకు ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల సామాజిక ఆర్థిక విద్య ఉపాధి రాజకీయ అవకాశాల ప్రణాళికల రూపకల్పనకు ఈ కులగణన చేపట్టనున్నారు. సామాజిక వివక్షతల నడుమ సమానమైన అభివృద్ధి చెందక ఇంకా బీదరికంలో కొట్టుమిట్టాడుతున్న వర్గాలకు సామాజిక న్యాయం ఆర్థిక ప్రగతి అందిస్తూ ఆయా వర్గాల మధ్య సంకుచితమైన విభేదాలను నిర్మూలన చేసి దేశ ఐక్యతకు తోడ్పడుతుంది ఈ కులగణన. కులగణన అంటే కేవలం జనాభాను లెక్కించడం ఒక్కటే కాదు. ఆయా కులాల సంఖ్య, మతం, ఏఏ కులాల్లో ఎంతమంది చదువుకుంటున్నారు, ఏ ఉద్యోగాలు చేస్తున్నారు, ఏ రకమైన ఆర్థిక ప్రగతి సాధించారు, ప్రధాన ఆదాయ వనరులుగా దేనిమీద ఎక్కువగా ఆధారపడ్డారు, ఎటువంటి రాజకీయ సామాజిక స్థితులలో ఉన్నారు వంటి ప్రధానమైన అంశాలను ఈ కులగణన లెక్కించి ఏ వర్గాలకు ఇకపై ఏ అవకాశాలు కల్పించాలో ఒక అవగాహన ఏర్పడుతుంది. 1980లో మండల్ కమిషన్ నివేదిక ప్రకారం ఓబీసీల జనాభా 52% ఉందని అంచనా వేసింది.ఇవాళ 63%గా తేలింది.

http://vaasthavanestham.com
వాస్తవ నేస్తం
తెలుగు దిన పత్రిక
ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా..


# స్థానిక వార్తలు

# నిరుద్యోగ యువతీ యువకులకు నైపుణ్య శిక్షణపై వర్కుషాప్ నిర్వహణ




**వాస్తవ నేస్తం,బోనకల్:** తెలంగాణ రాష్ట్ర ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ప్రొడక్టివిటీ కౌన్సిల్ వారిచే బోనకల్ లో నిరుద్యోగ ఎస్సీ,ఎస్టీ పురుషులకు స్థానిక ఎస్ఆర్ గార్డెన్ లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా జిల్లా ఉపాధి కల్పన అధికారి శ్రీరామ్,ఏపిపిసి కో ఆర్డినేటర్ సత్యం శిక్షణ నిర్వహకులు వీర బ్రహ్మచారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపాధి కల్పన అధికారి కొండపల్లి శ్రీరామ్ మాట్లాడుతూ యువత ఉపాధి అవకాశాల్ని అందుకోవాలని ఇలాంటి నైపుణ్యశిక్షణ అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న యువతకు ధ్రువ పత్రం తోపాటు సంస్థ బ్యాగ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల ములోని వివిధ గ్రామాల నిరుద్యోగ పురుషులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## బొజ్జ గూడెం తండాలో సీసీ రోడ్ నిర్మాణ పనుల శంకుస్థాపన



**వాస్తవ నేస్తం,అనంతగిరి:** ఉపాధి హామీ నిధులతో బొజ్జగూడెం తండాలో రూ.5 లక్షల వ్యయంతో సిసి రోడ్ నిర్మాణ పనులకు మండల అధ్యక్షుడు ముస్కు శ్రీనివాస్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో గ్రామాలలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని అన్నారు.ఈ కార్యక్రమంలో శాంతినగర్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గనుగుల గోపాల్ రెడ్డి, బుర్ర పుల్లారెడ్డి, వైస్ ఎంపీపీ రామా, మాజీ సర్పంచ్ వెంకటేశ్వర్లు, మాజీ ఉప సర్పంచ్ మాండన్ హరిప్రసాద్, మాండన్ బాబురావు, రాము, కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## కళ్యాణ లక్ష్మి పథకంతో వేదింటి ఆడపడుచులకు చేయూత

**ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి**



**వాస్తవ నేస్తం,అనంతగిరి:** కళ్యాణ లక్ష్మి పథకం ద్వారా ప్రభుత్వం పేదింటి ఆడపడుచుల పెండ్లి లకు ఆర్థిక సాయం అందజేస్తుందని ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి అన్నారు. శుక్రవారం కోదాడ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అనంతగిరి మండలానికి చెందిన లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి షాది ముబారక్ చెక్కులను ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో అనంతగిరి మండల అధ్యక్షుడు ముస్కు శ్రీనివాస్ రెడ్డి, ఎంపీపీ చుందూరు వెంకటేశ్వరరావు, గనుగుల గోపాల్ రెడ్డి, బుర్ర పుల్లారెడ్డి, దేగ కొండయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రజాపతి నిధులు తదితరులు పాల్గొన్నారు.

## ముస్లిం సోదరులతో ప్రత్యేక ప్రార్థన కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్




**వాస్తవ నేస్తం,కూకట్పల్లి:** 124 డివిజన్ ఎల్లమ్మబండ పరిధిలోని ముస్లిం గ్రేవియాడ్ లో ఏర్పాటుచేసిన ప్రార్థన మందిరం (మసీదు అబూ బకర్ సిద్ధిక్ )లో ముస్లిం సోదరులు ఈద్ ఘా, గ్రేవీయాడ్, మస్జీద్ డివిజన్ లోని అన్ని మసీదు కమిటీ అసోసియేషన్ సభ్యుల ఆధ్వర్యంలో శుక్రవారం సందర్భంగా ప్రార్థన కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ హాజరై ముస్లిం సోదరులతో కలిసి ప్రార్థన కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది. రానున్న రంజాన్ మాసం సందర్భంగా కార్పొరేటర్ ముస్లింలు అందరికి రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు, మైనారిటీ కమిటీ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నాలాలను, చెరువుల కబ్జాలను ఉపేక్షించేది లేదు: బండి రమేష్



**వాస్తవ నేస్తం,కూకట్పల్లి:** కూకట్పల్లి నియోజకవర్గంలోని చెరువులు కబ్జాకు గురై అన్యాక్రాంతమవు తున్నాయని, గతపాలకుల నిర్లక్ష్యం, అధికారుల నిర్లక్ష్యం వలన బఫర్ జోన్, ఎఫ్ టి ఎల్ లలో, నాలాలను కబ్జా చేయడం వలన వర్షాకాలం వచ్చినప్పుడు వరదలు రావడంతో ఇండ్లలోకి నిరుచేరి ప్రజలు అష్టకష్టాలు పడుతారు, ఆ సమయంలో ప్రజలు ప్రభుత్వాన్ని నిందిస్తారు, కాబట్టి నాలాలను, చెరువుల కబ్జాలను ఉపేక్షించేది లేదని అధికారులను హెచ్చరించారు. కూకట్పల్లి లోని రంగాధముని చెరువు నాలాను ఎన్ఫోర్స్మెం ట్, జిహెచ్ఎంసి అసిస్టెంట్ సిటీ ప్లానర్ సమక్షంలో పరిశీలించగా అక్కడి నాల యొక్క శాశ్వత ప్రవాహం నుండి మళ్లించి కొంతమంది బడా వ్యక్తులు, ఏమమీ స్వాన్ లేక్ బిల్డర్స్ నాలపై శాశ్వత కట్టడాలను నిర్మించి కబ్జా చేసారని కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బండి రమేష్ అన్నారు. కూకట్పల్లి నియోజకవర్గం లోని బాలాజినగర్ డివిజన్ రంగా ధముని చెరువు నాలను పరిశీలించడం జరిగింది. నియోజక వర్గం కాంగ్రెస్ నాయకుడు గొట్టిముక్కల వెంకటేశ్వర రావు, ఏ బ్లాక్ అధ్యక్షులు తూము వేణు, బి బ్లాక్ అధ్యక్షులు నాగిరెడ్డి, డివిజన్ అధ్యక్షులు కృష్ణ రాజపుత్, శేరి సతీష్ రెడ్డి, కే దినేష్ కుమార్, సాదు ప్రతాప్ రెడ్డి, రఘు, సునీల్ యాదవ్, మేకల రమేష్, కుక్కల రమేష్, చూ ను పాష, నయీమ్, అల్లావుద్దీన్, ఖాజా, అమీర్, మోసిన్, జీషన్, ఇర్ఫన్, మొహమ్మద్ అక్బర్,మహిళా నాయకురాళ్లు, పుష్ప రెడ్డి, రేష్మ, కృష్ణవేణి, జ్యోతి, కల్పనా, పాల్గొన్నారు.

## అయోధ్య బాలరాముని దర్శించుకున్న భక్తులు



**వాస్తవ నేస్తం,ముధోల్:** హిందువుల ఆరాధ్య దైవం బాలరాముని దర్శించుకోవడం ఎంతో సంతోషంగా ఉందని రామ భక్తులు టక్కరి రమేష్, ధర్మపురి సుదర్శన్ అన్నారు. ఈనెల 22వ తేదీన అయోధ్యలోని శ్రీరాములు దర్శనానికి తానూర్ మండలంలోని భోసి గ్రామానికి చెందిన కర సేవకుడు టక్కరి రమేష్ ఎంతో భక్తి శ్రద్ధలతో దర్శించుకున్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హిందువుల ఆరాధ్య దైవం శ్రీ బాలరాముడి 528 సంవత్సరాల కళ నెరవేరడం యావత్తు దేశానికి నిదర్శనం అన్నారు. రామాలయ నిర్మాణ ఉద్యమంలో తాను పాల్గొనడం గర్వకారణంగా ఉందన్నారు. అయోధ్యాలో శ్రీ బాల రాముని పూజించే భాగ్యం కలిగినందు కు పునర్జన్మ సుకృతమని సంతోషం వ్యక్తం చేశారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం


**వాస్తవ నేస్తం,ముధోల్:** మండల కేంద్రమైన ముధోల్ లో శనివారం ఉదయం 10 నుండి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్ కో ఏఈ శ్రీకాంత్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాబోయే రోజుల్లో మెరు గైన విద్యుత్ సరఫరా అందించడంలో భాగంగా విద్యుత్ వైర్లు, స్తంభాలు మరమ్మతులు జరుగుతున్న దృశ్య విద్యుత్ సరఫరా లో అంతరాయం ఉంటుందన్నారు. దీనికి వినియోగదా రులు సహకరించాలని ఆయన కోరారు.

## ఆర్ఎంపీ క్లినిక్ లపై దాడులను ఆపాలి

**ఆర్ఎంపిడబ్ల్యూఏ జిల్లా కార్యదర్శి బోయినపల్లి శ్రీనివాస్ రావు**

**వాస్తవ నేస్తం,బోనకల్:** గతకొద్ది రోజులుగా రాష్ట్రంలో వివిధ జిల్లాల్లో ఉన్న ఆర్ఎంపి, పియంపి ల క్లినిక్ లపై వైద్య శాఖ అధికారులు చేస్తున్న దాడులను వెంటనే ఆపాలని ఆర్ఎంపిడబ్ల్యూఏ జిల్లా కార్యదర్శి బోయినపల్లి శ్రీనివాస్ రావు జిల్లా కమిటీ సభ్యులు షేక్ నాగుల్ మీరా లు శుక్రవారం ఓ ప్రకటనలో అన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కొన్ని దశాబ్దాలుగా గ్రామీణ ప్రాంతాల్లో పేదప్రజలకు ప్రాథమిక వైద్యాన్ని అందిస్తున్న గ్రామీణ వైద్యులపై వైద్య శాఖ అధికారులు చేస్తున్న దాడులపై పునరాలోచనచేయాలని కోరారు. కొంత మంది గ్రామీణ వైద్యులు పరిమితికిమించి చేస్తున్న అనైతిక వైద్య పద్ధతులను మార్చుకోవాలని హితవు పలికారు. అడ్డగోలుగా వైద్యం చేస్తున్న ఆర్ఎంపి ల వ్యవహారశైలి వలన గ్రామీణ వైద్య వ్యవస్థకి కళకంగా మారే అవకాశం ఉందన్నారు. ఇకనైనా గ్రామీణ వైద్యులు బాధ్యతయుతమైన వైద్యం అందించాలన్నారు.

## తహసీల్దార్ కు ఘన సన్మానం



**వాస్తవ నేస్తం,ముధోల్:** ముధోల్ తహసీల్దార్ గా విట్ఠల్ బాధ్య తలను చేపట్టారు. దీంతో శుక్రవారం దళిత సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలో ఉన్న భూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ సన్మాన కార్యక్రమంలో దళిత సంఘ నాయకులు అశోక్, కేర్బ, దర్మేందర్, శ్రవణ్, కపిల్ తదితరులున్నారు.

# భక్తులతో కిటకిట సమ్మక్క సారలమ్మ జాతర



**వాస్తవ నేస్తం,ముధోల్:** మండలంలోని ఎడ్ బిడ్ గ్రా మంలో గత మూడు రోజులుగా కొన సాగుతున్న సమ్మక్క సారలమ్మల జాతర ఎంతో వైభవంగా జరుగుతుంది. శు క్రవారం మండల కేంద్రమైన ముధోల్ తోపాటు మండలంలోని ఆయా గ్రామా ల నుండి పక్క మండలాలైన లోకేశ్వ రం, బైంసా, బాసర, కుబీర్, కుంటాల మండలాల నుండి పక్క రాష్ట్రమైన మహారాష్ట్ర లోని ధర్మాబాద్, నాందేడ్ తదితర ప్రాంతాల నుండి భక్తులు అధి క సంఖ్యలో అమ్మవార్లను దర్శించు కున్నారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవార్లకు బంగారం (బెల్లం) ఒడి బియ్యం,మేకలు కోళ్లతో మొక్కలను చెల్లించుకున్నారు. సమ్మక్క- సారల మ్మలను దర్శించుకోవడం ఎంతో సంతోషంగా ఉందని భక్తులు వ్యక్తం చేశారు. దీంతో దేవాదాయ స్థా పకులు రేణుకమ్మ, దేవాలయ ధర్మకర్త జాదవ్ సతీష్ కుమార్ అమ్మవార్లకు పూజలు చేసి అనంతరం మాట్లాడుతూ సమ్మ క్క సారలమ్మ జాతర మొక్కలను తీ ర్చుకోవడానికి భక్తులు ఆయా ప్రాం తాల నుండి వస్తున్నారన్నారు. గత మూడు రోజుల నుండి భక్తులు అమ్మ వార్లకు కానుకలను ఓడి బియ్యం సమర్పించి నిలువెత్తు బంగారాన్ని (బెల్లం) పంచిపెట్టారు. ఆలయ ప్రాంగ ణంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు వారు పేర్కొన్నారు.

# కుట్టు మిషన్ శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు ఇచ్చి మిషన్లు ఇవ్వకపోవడం బాధాకరం



**వాస్తవ నేస్తం,పటాన్చెరు:** సంగారెడ్డి జిల్లా జిన్నారం మండల కేంద్రంలో ఎమ్మెల్యే గూడెం మైపాల్ రెడ్డి స్థానిక ప్రజాప్రతినిధులు మహిళల సంక్షేమం కోసం మహిళలు స్వయం శక్తితో ఎదగాలని జిన్నారం గ్రామంలో కుట్టుమిషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగింది కుట్టు మిషన్ నేర్పించడానికి ఇద్దర్నీ ఇన్చార్జి లను నియమించారు మహిళలకు శిక్షణ పూర్తి కావడంతో మహిళలకు ఇచ్చిన హామీ ప్రకారం 45 కుట్టుమిషన్లు ఇస్తామని తెలిపారు శిక్షణ పూర్తయిన వారికి సర్టిఫికెట్ కూడా ఇవ్వడం జరిగింది కానీ ఇంతవరకు కుట్టు మిషన్లు ఇవ్వకపోవడం చాలా బాధాకరంగా ఉంది అని ఇంచార్జ్ నీలం శ్రీ లత అన్నారు ఎమ్మెల్యే గూడెం మైపాల్ రెడ్డి అభివృద్ధి సంక్షేమం కోసం పది సంవత్సరాలుగా తప్పించిన వ్యక్తి మా మహిళలను చైతన్యవంతులుగా తీర్చిదిద్దిన ఘనత గూడెం మైపాల్ రెడ్డి అదేవిధంగా శిక్షణ పొందిన మహిళలకు కుట్టు మిషన్లు త్వరగా ఇచ్చే విధంగా చూడాలని ప్రజా నాయకుడు గూడెం మైపాల్ రెడ్డికి తెలియబరుస్తున్నాను అదేవిధంగా ప్రజాప్రతి నిధులు పట్టించుకోని ఎమ్మెల్యే చేతుల మీదుగా మాకు కుటు మిషన్ ఇచ్చే విధంగా చూడాలని ఎమ్మెల్యే కు తెలియపరుస్తూ మాకు సహకారం అందించిన ప్రజా ప్రతినిధులు పట్టించుకోని తక్షణమే శిక్షణ పొందిన లబ్ధిదారులకు కుట్టు మిషన్లు అందజేయాలని కోరారు.

# గోళ్లఘట్ గ్రామ సమస్యలు ప్రభుత్వానికి నివేదిస్తం

**జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్**



**వాస్తవ నేస్తం,భీంపూర్:** మండలంలోని గొల్లఘట్ రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వానికి నివేదిస్తామని ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికలను బహిష్కరించిన గోళ్లఘట్ గ్రామాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో సమావేశమయ్యారు. అనంతరం సమస్యల పై ఆరా తీశారు. రోడ్డు,తాగునీరు,విద్యుత్ సమస్యలతో పాటు అసంపూర్తిగా ఉన్న పాఠశాల,అంగన్వాడీ భవనం పూర్తిచేయాలని గ్రామస్థులు కోరారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో విధిగా పాల్గొని తమ ఓటు హక్కును గ్రామస్తులు అందరూ వినియోగించు కోవాలని గ్రామస్తులను కోరారు..తమ విధుల పట్లా నిర్లక్ష్యం వహిస్తున్న పంచాయతీ కార్యదర్శి పై చర్యలు తీసుకోవాలని ఎంపిడివో గోపాలకృష్ణ రెడ్డిని ఆదేశించారు.. ఆయన వెంట తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపిడివో గోపాలకృష్ణ రెడ్డి, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ చంద్రశేఖర్, ఎస్ఐ ప్రదీప్,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు..

## మందిరానికి విరాళం అందజేసిన ఎస్ఎస్ ఫ్యాషన్ షాపింగ్ మాల్ యజమాని




**వాస్తవ నేస్తం(బీర్కూర్):** బాన్సువాడ నియోజకవర్గంలోని బీర్కూరు మండలంలో బరంగ్ ఎడ్గి గ్రామంలో నూత నంగా నిర్మిస్తున్న పరమేశ్వర ఆలయానికి బాన్సువాడ ఎస్ఎస్ ఫ్యాషన్ మాల్ యజమాని మోహరీల్ శ్రీనివాస్ లక్ష రూపాయలు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆయనను గ్రామస్తులు, లింగయత్ సమాజం బరంగేడ్గి గ్రామస్తులు ప్రజలు ధన్యవాదాలు తెలియజేశారు.

http://vaasthavanestham.com
# వాస్తవ నేస్తం
తెలుగు దిన పత్రిక
ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...



## స్థానిక వార్తలు

### అంత్యక్రియలకు ఆర్థికసాయం అందజేత



**వాస్తవ నేస్తం,కూకట్పల్లి:** 124 డివిజన్ ఎల్లమ్మబండ పరిధిలోని ఎన్టీఆర్ నగర్ చాలిస్ మకాన్ బ్లాక్ నెంబర్ 299 జిఎఫ్ లో నివసించే నరసింహ (74) అనారోగ్యంతో బాధపడుతూ మరణించాడు. ఇట్టి విషయం తెలుసుకున్న డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, డివిజి ట్రస్ట్ ద్వారా 5000/- రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో శివరాజ్ గౌడ్, మల్లేష్, నరసింహులు, నాగరాజు, ఉమేష్, ప్రీతి తదితరులు ఉన్నారు.

### భూగర్భ డ్రైనేజీ సమస్యల పరిశీలన



**వాస్తవ నేస్తం,కూకట్పల్లి:** నియోజకవర్గంలోని అల్లాపూర్ డివిజన్ పరిధిలోని గాయత్రి నగర్, పద్మావతి నగర్, సర్వే నంబర్ 18, కరెంటు ఆఫీస్ గల్లి, లలో భూగర్భ డ్రైనేజీ సమస్యలపై కార్పొరేటర్ సబిహా గౌసుద్దీన్, మేడ్చల్ జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు మహమ్మద్ గౌసుద్దీన్, జిహెచ్ఎంసి ఇంజనీరింగ్ అధికారి ఏఈ రంజిత్, జలమండలి అధికారులు డిజీఎం రవికుమార్ తో కలిసి స్థానికుల ఫిర్యాదు మేరకు భూగర్భ డ్రైనేజీ సమస్యలు తెలుసుకునేందుకు పర్యటించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రస్తుతం భూగర్భ డ్రైనేజీ పైప్ లైన్ 150 ఎంఎం డయా ఉన్నందున స్థానికంగా నివసిస్తున్న ప్రజలు రెగ్యులర్గా డ్రైనేజీ పొంగి రహదారిపై ప్రజల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో నజీర్, సంజీవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

### ఎమ్మెల్యే లాస్య నందిత అకాల మరణం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది

**ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు**



**వాస్తవ నేస్తం,కూకట్పల్లి:** శుక్రవారం ఓఆర్ఆర్ పై జరిగిన రోడ్డు ప్రమాదంలో సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందితి మరణం తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని కొన్ని రోజుల క్రితం ఆమె తండ్రి సాయన్న మరణం మరువక ముందే కుటుంబంలో ఇలా జరగడం చాలా బాధాకరమైన విషయమని ఎంతో భవిష్యత్తు ఉన్న లాస్య నందిత ఇలా రోడ్డు ప్రమాదంలో చనిపోవడం నిజంగా ఇప్పటికీ నమ్మశక్యంగా లేదని. ఈ సందర్భంగా సాయన్న కుటుంబంతో ఉన్న అనుబంధాన్ని కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు గుర్తు చేసుకున్నారు. ఎంతో సౌమ్యంగా అందరినీ అన్నా అంటూ పలకరిస్తూ చిరునవ్వులు చిందిస్తూ కళ్ళ ముందు కనిపించే లాస్య నందితా ఇక లేదు అన్న వార్త జీర్ణించుకోలేకపోతున్నామని విషాదం వ్యక్తం చేశారు. భగవంతుడు ఆ కుటుంబానికి ధైర్యాన్ని ప్రసాదించి ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటున్నాను అని తెలిపారు.

### శేర్లింగంపల్లి నియోజకవర్గ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం



**వాస్తవ నేస్తం,కూకట్పల్లి:** శేరిలింగంపల్లి నియోజకవర్గం లో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం కాంగ్రెస్ పార్టీ శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇంచార్జి జగదీశ్వర్ గౌడ్ అధ్యక్షత నల్లగండ్ల, హైదర్ నగర్ లోని రాం నరేష్ నగర్ కమ్యూనిటీ హాల్ లో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వికారాబాద్ జిల్లా పరిషత్ చైర్మన్ పట్నం సునీత మహేందర్ రెడ్డి గారు హాజరయ్యారు. వారితో పాటు పాల్గొన్న గొట్టుముక్కల వెంకటేశ్వర రావు. ఈ కార్యక్రమం లో రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో అనుసరించాల్సిన విధి విధానాలపైన కార్యకర్తల అభిప్రాయాలు సేకరించడం జరిగింది. పట్నం సునితమహేందర్ రెడ్డి, జగదీశ్వర్ గౌడ్ మాట్లాడుతూ కార్యకర్తలు అందరూ సమిష్టిగా కృషి చేసి చేవెళ్ల పార్లమెంట్ నియోజక వర్గంలో కాంగ్రెస్ పార్టీ గెలుపుకు కృషి చేయాలని వారు కోరారు.

# ఘనంగా క్రాంతి జూనియర్ కళాశాలలో విద్యార్థుల వీడ్కోలు సభ

**వాస్తవ నేస్తం,వైరా:** స్థానిక ఠాగూర్ విద్యాసంస్థలైన క్రాంతి జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం విద్యాసంస్థల చైర్మన్ వాసిరెడ్డి సునీత అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ సంక్రాంతి రవికుమార్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదివి రాబోయే ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల్లో రాష్ట్రస్థాయి మార్కులు సాధించాలని, సూచించారు. క్రమశిక్షణ నైతిక విలువలతో కూడిన విద్యా బోధన చేయడమే మా క్రాంతి జూనియర్ కళాశాల ప్రత్యేకత అని అన్నారు.గత విద్యా సంవత్సరంలో రాష్ట్రస్థాయి మార్కులు సాధించిన విద్యార్థులను మరియు వివిధ సామాజికసేవ, సాంస్కృతిక, కార్యక్రమాల్లో పాల్గొన్న విద్యార్థులను అభినందించి బహుమతులు అందించారు అనంతరం విద్యార్థులు ఆటపాటలతో నృత్యాలు చేస్తూ అలరించారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల చైర్మన్ వాసిరెడ్డి సునీత, డైరెక్టర్ సంక్రాంతి సంయోగిత, టీఆర్ఎస్ ఎంఏ ఉపాధ్యక్షులు ఉమాశంకర్, ప్రముఖ మోటివేటర్ తాటిపల్లి సుధీర్, ప్రిన్సిపల్ కృష్ణారావు, ఎన్.ఎస్.ఎస్.పి ఓ లింగారావు, అధ్యాపకులు మజీద్,వేణు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.




# ముందుకు సాగని.. బ్యాక్ వాటర్ పనులు

**నల్గొండ :** కరవు పీడిత నల్గొండ జిల్లాకు సాగునీరు అందించాలన్న దశాబ్ధాల కల ఇంకా కలగానే మిగిలిపోయింది. ఆ కలతీరడానికి ఉమ్మడి నల్గొండ రైతంగా ఇంకా ఎదురుచూపుల్లోనే గడుపుతోంది.శ్రీశైలం బ్యాక్ వాటర్ ను వినియోగించుకుని నల్గొండ జిల్లాలో ప్రధానంగా దేవరకొండ, మునుగోడు నియోజకవర్గాలకు సాగునీటిని, ఫ్లోరైడ్ పీడిత ప్రాంతాలకు తాగునీటి అందించాల్సిన శ్రీశైలం ఎడమగట్టు బ్రాంచ్ కెనాల్ (ఎస్.ఎల్.బి.సి) ప్రాజెక్ట్ పరిస్థితి ఒక అడుగు ముందుకు, వంద అడుగులు వెనక్కి అన్న చందంగా తయారైంది.ఎస్.ఎల్.బి.సి టన్నెల్ ప్రాజెక్టు ప్రతిపాదనలు, శంకుస్థాపనల చరిత్ర చాలా పాతది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో 2004లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి సీఎంగా బాధ్యతలు చేపట్టాక మొదలైన సాగునీటి ప్రాజెక్టుల జలయజ్ఞం లో భాగంగా కార్యరూపం దాల్చింది.3లక్షల ఎకరాలకు సాగునీటిని అందించే లక్ష్యంతో రూ.1925కోట్ల అంచనాతో పనులు మొదలయ్యాయి. నిర్ణీత గడువు మేరకు ప్రాజెక్టు పనులు మొదలయ్యాక నాలుగేళ్లకు పూర్తికావాల్సి ఉన్నా ఇప్పటికీ అతీగతీ లేకుండా పోయింది. 2014లో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ (నాటి టీఆర్ఎస్) ప్రభుత్వం పదేళ్లు పాలనలో ఉన్నా ఒక్క అడుగూ ముందుకు పడలేదు. ఈ ప్రాజెక్టులో కాల్వలు తవ్వాల్సిన ప్రాంతమంతా నల్లమల రిజర్వు అటవీ ప్రాంతంలో ఉండడంతో ప్రాజెక్టు పట్టాలు ఎక్కడానికి ప్రతిబంధకంగా మారింది.శ్రీశైలం సొరంగ మార్గం ప్రాజెక్టు ముందుకు పడే అవకాశం కనిపించక పోవడంతో నాగార్జున సాగర్ బ్యాక్ వాటర్ నుంచి నీటిని ఎత్తిపోయడం ద్వారా నల్గొండ జిల్లాకు సాగు, తాగునీరు, హైదరాబాద్ నగరానికి తాగునీటిని అందించే ఉద్దేశంతో ఎలిమినేటి మాధవరెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు (అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ /ఎ.కె.బి.ఆర్) ను మొదలు పెట్టి పూర్తి చేశారు.ఎ.ఎం.ఆర్.పిని పూర్తి చేసే నాటికి ఆసియా ఖండంలో అతి ఎత్తైన ఎత్తిపోతల పథకంగా దీనికి పేరు వచ్చింది. నిర్వహణా భారం కూడా ఎక్కువగా ఉండడంతో ఎస్.ఎల్.బి.సి సొరంగ మార్గం ఒక్కటే పరిష్కారమని భావించారు.



1983లో ఎ.ఎం.ఆర్.పిని మొదలు పెడితే ఇరవై ఏళ్లు గడిచాక 2004లో ఎస్.ఎల్.బి.సి పనులు మొదలయ్యాయి. శ్రీశైలం ఎడమగట్టు బ్రాంచ్ కెనాల్ ప్రాజెక్టును 2004లో చేపట్టినా ఇంకా పెండింగులోనే ఉంది. శ్రీశైలం బ్యాక్ వాటర్ నుంచి సొరంగం ద్వారా నీటిని తీసుకుని నల్గొండ జిల్లా పరిధిలోని చందంపేట మండలం తెల్దేవర్ పల్లి వద్ద నీటిని బయటకు పోయడానికి మొత్తంగా సుమారు 44 కిలోమీటర్ల (43.930కి.మీ) మేర సొరంగం తవ్వాల్సి వచ్చింది.వైపు ఇన్ లెట్ 13.9కి.మీ నిడివిలో, నల్గొండ జిల్లా చందంపేట మండలంలో ఔట్ లెట్ కు 20.4 కిమీటర్ల నిడివిలో సొరంగాలు తవ్వాలి. దీనికి కోసం కోట్లాది రూపాయలు వెచ్చించింది. టన్నెల్ బోర్ మిషన్ (టీబీఎం)ను తెప్పించారు. ఇది రెండు సార్లు శ్రీశైలానికి భారీ వరదలు వచ్చిన సమయంలో నీటిలో మునిగిపోయి మర్మమతులు గురైంది.అన్ని అడ్డంకులు అధిగమించినా.. బీఆర్ఎస్ ప్రభుత్వం పెద్దగా ఈ ప్రాజెక్టును పట్టించుకోలేదు. దీంతో కాంట్రాక్టు సంస్థ కూడా చేతులు ఎత్తేసింది. చివరకు ప్రాజెక్టు పనులకు వినియోగించే కరెంటు చార్జీలు కూడా భారీగా పేరుకుపోయి విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. కేవలం విద్యుత్తు బిల్లులకు రూ.59 కోట్ల బకాయిలు ఉన్నాయంటే ప్రభుత్వ చిత్తశుద్దిని అర్థం చేసుకోవచ్చని ఈ ప్రాంత రైతు ఉద్యమ నాయకులు పేర్కొంటున్నారు. ఎస్.ఎల్.బి.సి ప్రాజెక్టును రూ.1925 కోట్ల అంచనాతో మొదలు పెడితే.. అదిప్పుడు రూ.4,900కోట్లకు పెరిగింది. ఇప్పటి దాకా ప్రాజెక్టు కోసం రూ.2700 కోట్ల ఖర్చు చేశారు. మరో రూ.2200 కోట్ల నిధుల అవసరం ఉంది. ఈ పరిస్థితుల్లో జిల్లాకు చెందిన సాగునీటి శాఖా మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఆర్ అండ్ బి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రాజెక్టును పూర్తి చేయడంపై శ్రద్ధ పెడుతున్నా.. కనీసం ఈ అయిదేళ్లలో పనులు పూర్తవుతాయా అన్న అనుమానాలు ఈ ప్రాంత రైతుల మదిని తొలుస్తోంది.

# డీఎస్సీ నోటిఫికేషన్ రద్దు

**హైదరాబాద్ :** ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం ఎదురు చూస్తున్న అభ్యర్థులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త అందించబోతోంది. గత ప్రభుత్వం విడుదల చేసిన డీఎస్సీ నోటిఫికేషన్ను రద్దుచేస్తూ.. మరికొన్ని పోస్టులను కలుపుతూ కొత్త డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఒకట్రెండు రోజుల్లో డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు సమాచారం. కొత్త నోటిఫికేషన్ ద్వారా దాదాపు 11 వేల టీచర్ పోస్టులను భర్తీచేసే అవకాశం ఉంది. ఇటీవలే గత ప్రభుత్వం విడుదల చేసిన గ్రూప్-1 నోటిఫికేషన్ను రద్దుచేసి గ్రూప్-1 కొత్త నోటిఫికేషన్ను ప్రభుత్వం విడుదల చేసిన సంగతి తెలిసిందే. తాగా డీఎస్సీని కూడా రద్దుచేసే యోచనలో రేవంత్ ప్రభుత్వం ఉంది.గత ప్రభుత్వం 5089 పోస్టులతో డీఎస్సీ-2023 నోటిఫికేషన్ జారీచేసిన సంగతి తెలిసిందే. వీటిలో ఎస్జీటీ - 2,575 పోస్టులు; స్కూల్ అసిస్టెంట్ -1,739 పోస్టులు, లాంగ్వేజ్ పండిట్ - 611 పోస్టులు, పీఈటీ - 164 పోస్టులు ఉన్నాయి. మొత్తం 1,76,530 మంది దరఖాస్తులు సమర్పించారు. వీరిలో సెకండరీ గ్రేడ్ టీచర్(ఎస్జీటీ) పోస్టులకు అత్యధికంగా 60,190 దరఖాస్తులు వచ్చాయి. ఇక ఇందులో 1,79,297 మంది పరీక్ష ఫీజు చెల్లించారు. ఖాళీల సంఖ్యను పెంచి మెగా డీఎస్సీ చేపట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. అందుకే పాత నోటిఫికేషన్ను రద్దు చేసి.. సుమారు మరో 5 వేల ఖాళీలను కలిపి 11 వేల పోస్టులతో కొత్త నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు.లోక్సభ ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చేలోపు కొత్త డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేయాలని భావిస్తున్నట్లు.. అందుకు తగిన విధంగా కసరత్తు చేస్తున్నట్లు సమాచారం.




అలాగే.. ప్రత్యేక అవసరాల పిల్లల (సీడబ్ల్యూఎస్ఎన్)కు బోధించేందుకు దాదాపు 1,500 స్పెషల్ ఎడ్యుకేటర్ పోస్టులను కూడా భర్తీ చేయాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఈసారి డీఎస్సీ నిర్వహణ సజావుగా జరిగేలా న్యాయపర సలహాలు తీసుకొని ముందుకెళ్లాలని అధికారులు భావిస్తున్నారు.వచ్చే ఏడాది జూన్లో కొత్త విద్యా సంవత్సరం ప్రారంభమయ్యే సమయానికి ఉపాధ్యాయులకు పోస్టింగులు పూర్తయితే విద్యార్థులకు ప్రయోజనం కలుగుతుందని నిపుణులు సూచిస్తున్నారు. దీంతో ఆలోగా ప్రక్రియ పూర్తయ్యేలా చూడాలని కాంగ్రెస్ సర్కార్ ఆదేశించినట్టు సమాచారం. అయితే... గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన డీఎస్సీ నోటిఫికేషన్ రద్దు చేస్తే సమస్యలు వస్తాయని విద్యాశాఖ వర్గాలు భావిస్తున్నాయి. దీంతో ఇప్పటికే భర్తీ చేయాలని నిర్ణయించిన 5,089 పోస్టులతో కలిపి అనుబంధ నోటిఫికేషన్ను జారీ చేసే అవకాశం ఉంది. మరోవైపు... ఉపాధ్యాయ పదోన్నతులు పూర్తయితే మరో 8,500 వరకు ఖాళీలు ఏర్పడతాయని విద్యాశాఖ అంచనా వేస్తోంది. అయితే కోర్టు కేసులతో ఆగిపోయిన ఉపాధ్యాయ పదోన్నతులకు, డీఎస్సీకి ముడిపెడితే నియామకాలు పూర్తికావనే అభిప్రాయమూ వ్యక్తమవుతోంది.

# స్థానిక వార్తలు

# రేటు తగ్గించే పరిస్థితి లేదు

## గెలాక్సీ ఎస్ 24 సిరీస్ అభివృద్ధి అత్యంత లాభదాయకం



హైదరాబాద్ : గెలాక్సీ ఎస్ 24 సిరీస్‌ను అభివృద్ధి చేయడం నా కెరీర్‌లో అత్యంత లాభదాయకమైన కాలమని, మొబైల్ ఏఐ యుగానికి స్వాగతం పలుకుతున్నామని శాంసంగ్ ఎలక్ట్రానిక్స్, ఎంఎక్స్ బిజినెస్ హెడ్, ప్రెసిడెంట్ డా.టీఎం.రోహ్ అన్నారు.ఆయన మాట్లాడుతూ.. ఇంజనీర్‌గా, తాను నమ్మశక్యం కాని ఆవిష్కరణలకు ఎన్నో ఉదాహరణలను చూశాను, కానీ, ఏఐ అనేది ఈ శతాబ్దపు అత్యంత పరివర్తనాత్మక సాంకేతికత అన్నారు. కొంతమంది ఇంజనీర్లు అటువంటి సమూల మార్పులు చేయగల సంభావ్యత కలిగిన సాంకేతికతతో పాల్గొనడానికి అవకాశం పొందుతారన్నారు. ఇది శాంసంగ్, మొబైల్ పరిశ్రమకు మాత్రమే కాకుండా, మానవాళికి గొప్ప మార్పును తెస్తుందన్నారు. ఫోన్‌లలో ఏఐను అనుసంధానించబడినప్పుడు, దానిని సరళంగా చెప్పాలంటే, ఒక విప్లవం అన్నారు. మొబైల్ అనుభవాలకు ఇది సరికొత్త యుగమన్నారు. శాంసంగ్ గెలాక్సీ ఇందులో ప్రముఖ పాత్ర పోషిస్తుందన్నారు. మొబైల్ పరికరాలు ఏఐకి ప్రాథమిక యాక్సెస్ పాయింట్‌గా మారతాయన్నారు. శాంసంగ్ గెలాక్సీ తమ విస్తృత, సమగ్రమైన ఉత్పత్తి పోర్ట్‌ఫోలియో, ఆవిష్కరణల వారసత్వం, బహిరంగ సహకారంతో - దాని ప్రపంచ విస్తరణను వేగవంతం చేయడానికి గొప్ప స్థానంలో ఉందన్నారు. తాము మొబైల్ ఏఐని సులభంగా పొందే అవకాశం అందిస్తున్నామని, అందరికీ కొత్త అవకాశాలను అందిస్తామన్నారు. గెలాక్సీ ఎస్ 24 సిరీస్‌ను అభివృద్ధి చేస్తున్న వేళ తాము అనేక ఆలోచనలు, భావనలకు జీవం పోయాలనుకున్నామన్నారు. శాంసంగ్ మొబైల్ ఏఐ అనుభవాలను నిరంతరం మెరుగు పరుస్తుందన్నారు.

## జియో ఫైనాన్షియల్ సరికొత్త రికార్డులు!



లదేశీయ డైవర్సిఫైడ్ దిగ్గజం రిలయన్స్ గ్రూప్ మార్కెట్ క్యాపిటలైజేషన్ లో సరికొత్త రికార్డ్‌లను నమోదు చేశాయి. జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ షేర్ ధర 35 శాతం పెరిగింది. ఫలితంగా ఆ సంస్థ మార్కెట్ క్యాపిటలైజేషన్ తొలిసారి రూ. 2 లక్షల కోట్లను అధిగమించింది. ఫిబ్రవరి 23న పేరెంట్ కంపెనీ రిలయన్స్ ఇండస్ట్రీస్ సైతం రికార్డు స్థాయిని తాకింది. ఉదయం 10.30 గంటల సమయానికి జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ షేర్లు 8 శాతం పెరిగి.. ఒక్కోషేర్ ధర రికార్డు స్థాయిలో రూ. 326కి చేరుకుంది. ఈ స్టాక్ వరుసగా ఐదవ సెషన్‌లో 17 శాతం వృద్ధిని నమోదు చేయడంతో సంస్థ విలువ పరంగా రూ. 2.08 లక్షల కోట్లు దాటేందుకు దోహదపడింది. ఆర్ఐఎల్ ఇంట్రాడేలో రికార్డు స్థాయిలో రూ.2,989ను తాకింది. బీఎస్ఈలో ఈ షేరు మునుపటి ముగింపుతో పోలిస్తే 0.5 శాతం పెరిగి రూ.2,978 వద్ద ట్రేడవుతోంది. జియో ఫైనాన్షియల్ సెక్యూర్డ్ లోన్లు అందించేందుకు దృష్టి సారిస్తోంది. ఆర్థిక విభాగంలో ప్రస్తుత మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటుంది. ఇది రెండు కొత్త ఉత్పత్తులను ప్రారంభించడం ద్వారా దాని సురక్షిత రుణ వ్యాపారాన్ని పెంచడం లక్ష్యంగా పెట్టుకుంది. దాని అనుబంధ సంస్థ జియో ఇన్ఫర్మేషన్ అగ్రిగేటర్ సర్వీసెస్ లిమిటెడ్ ద్వారా ఎయిర్ ఫైబర్, ఫోన్‌లు, ల్యాప్‌టాప్‌ల వంటి పరికరాల కోసం ఆపరేటింగ్, ఫైనాన్సింగ్ లీజులను అందించడం, చైన్ ఫైనాన్సింగ్, సరఫరాదారుల వర్కింగ్ క్యాపిటల్ అవసరాలను తీర్చేలా వ్యూహాత్మకంగా వడివడిగా అడుగులు వేస్తోంది.

**ముంబై:** బ్యాంకులకు తానిచ్చే రుణాలపై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) వసూలు చేసే వడ్డీరేటు- రెపోను తగ్గించే పరిస్థితి ప్రస్తుతం లేదని గవర్నర్ శక్తికాంతదాస్ నేతృత్వంలోని ఆరుగురు సభ్యుల ద్రవ్య విధాన కమిటీ ఉద్ఘాటించింది.అదే జరిగితే.. ధరలు తగ్గుదలకు ఇప్పటి వరకూ తీసుకున్న చర్యలు ప్రయోజనం లేకుండా పోతాయని అభిప్రాయపడింది. ధరల కట్టడే ఆర్‌బీఐ ప్రధాన ధ్యేయమని స్పష్టం చేసింది. ఈ నెల ప్రారంభంలో జరిగిన ఆర్‌బీఐ పాలసీ సమీక్షా సమావేశం మినిట్స్ ఈ అంశాలను వెల్లడించాయి. ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం, అంతర్జాతీయంగా పెరిగిన క్రూడ్ ధరలు, దీనితో ప్రపంచ వ్యాప్తంగా ద్రవ్యోల్బణం భయాల నేపథ్యంలో ఈ సవాలును అధిగమించడానికి ఆర్‌బీఐ 2022 మే నుంచి 2023 ఫిబ్రవరి నాటికి రెపో రేటును 250 బేసిస్ పాయింట్లు పెంచింది. దీనితో ఈ రేటు 6.5 శాతానికి చేరింది. అయితే ద్రవ్యోల్బణం కొద్దిగా అదుపులోకి వస్తుందన్న సంకేతాల నేపథ్యంలో ఈ నెల ప్రారంభ సమీక్ష సహా గడచిన ఐదు ద్వైమాసిక సమావేశాల్లో యథాతథ రేటు కొనసాగింపునకే ఆర్‌బీఐ పెద్దపీట వేసింది. రిటైల్ ద్రవ్యోల్బణం 2 శాతం ప్లస్, 2 శాతం మైనస్‌తో 4 శాతంగా ఉండాలని కేంద్రం ఆర్‌బీఐకి నిర్దేశిస్తున్నప్పటికీ తమ లక్ష్యం 4 శాతమేనని గవర్నర్ శక్తికాంతదాస్ స్పష్టం చేస్తూ వస్తున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం వినియోగ ధరల సూచీ ఆధారిత రిటైల్ ద్రవ్యోల్బణం 5.4 శాతం నుంచి 4.5 శాతానికి తగ్గుతుందని అంచనా. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 4వ త్రైమాసికంలో 5 శాతం ద్రవ్యోల్బణం నమోదవుతుందని ఆర్‌బీఐ భావిస్తోంది. తగిన స్థాయిలో వర్షపాతం నమోదయితే.. 2024-25 క్యూ1,క్యూ2, క్యూ3, క్యూ4లలో వరుసగా 5 శాతం, 4 శాతం, 4.6 శాతం, 4.7 శాతం చొప్పున ద్రవ్యోల్బణం నమోదవుతని పాలసీ సమీక్ష అంచనా వేసింది.




# అతిపెద్ద ఎయిర్ మార్కెట్‌గా భారత్




**న్యూఢిల్లీ :** టర్బోప్రాప్ విమానాల తయారీ సంస్థ ఏటీఆర్ భారత దేశంలో ప్రాంతీయ విమాన ప్రయాణానికి పెరుగుతున్న డిమాండ్‌తో భారతదేశం అతిపెద్ద మార్కెట్‌గా అవతరించనుందని ఆసియా పసిఫిక్ వాణిజ్య విభాగం అధిపతి జీన్-పియర్ క్లెర్సిన్ బిజినెస్ స్టాండర్డ్‌తో చెప్పారు. ఏటీఆర్ ప్రస్తుతం దేశంలో 67 విమానాలు నడుపుతోంది. ఇందలో ఇండిగో 45, అలయన్స్ ఎయిర్ 20, ఫ్లై91 సంస్థ రెండు విమానాలు నడుపుతున్నాయి. ఈ విమానాలు 70 నుంచి 80 సీటింగ్ కెపాసిటీ కలిగి ఉంటాయి. 1,500 కి.మీ పరిధిలో తిరుగుతాయి. ప్రాంతీయ ప్రయాణాలకు ఇవి చాలా అనుకూలమైనవి. చిన్న నగరాలు, పట్టణాలను కలుపుతుంది. ఇక ఎయిర్‌బస్, లియోనార్డో మధ్య జాయింట్ వెంచర్ అయిన ఏటీఆర్ ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 1,400 విమానాలు కలిగి ఉంది. 'ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఏటీఆర్ విమానాల సముదాయాన్ని భారతదేశం కలిగి ఉంది. భారతదేశంలో ఏటీఆర్ విమానాల సగటు వయస్సు అత్యల్పంగా ఉంది. మనకు భారతదేశం యొక్క ప్రాముఖ్యతను మరియు విమానయానాన్ని పెద్దగా చూడకపోతే కొంత అంధత్వం ఉంటుంది'అని క్లెర్సిన్ పేర్కొన్నాడు. 'ఒక దేశంలో ఏటీఆర్ విమానాల సంఖ్య పరంగా, భారతదేశం మొదటి మూడు స్థానాల్లో ఉంది. ప్రస్తుతం 100 ఏటీఆర్ విమానాలతో ఇండోనేషియా నంబర్ వన్ స్థానంలో ఉంది. బ్రెజిల్ 70 విమానలతో రెండో స్థానంలో ఉండగా, భారత్ 67 విమానాలతో మూడో స్థానంలో ఉంది. రాబోయే పదేళ్లలో భారత్ అతిపెద్ద విమాన మార్కెట్ కాబోతోంది అని వెల్లడించాడు. ఇక భారత్ రాబోయే పదేళ్లలో భారీగా టర్బోప్రాప్ విమానాలు కొనుగోలు చేస్తుందని తెలిపాడు. తమ అంచనా ప్రకారం రాబోయే పదేళ్లలో కొత్తగా 50 నుంచి 150 వరకు టర్బోప్రాప్ విమానాలు కొనుగోలు చేయవచ్చని పేర్కొన్నారు.

# స్పోర్ట్స్

# రూట్ సెంచరీ..
# రాంచీలో 'రూట్' మార్చిన ఇంగ్లండ్




బజ్‌బాల్ ఆటతో దూకుడుకు మారుపేరుగా మారిన ఇంగ్లండ్ క్రికెట్ జట్టు.. రాంచీ టెస్టులో భాగంగా తొలి రోజు ఆ విధానానికి స్వస్తి చెప్పింది. రాంచీ పిచ్‌ను చూసి 'ఇదేదో తేడాగా ఉంది' అని ముందే అనుకున్న ఇంగ్లీష్ టీమ్.. తొలి రోజు ఫస్ట్ సెషన్‌లో వెంటవెంటనే ఐదు వికెట్లు కోల్పోవడంతో బజ్‌బాల్‌కు స్వస్తి పలికి అసలైన టెస్టు ఆడేందుకు యత్నించింది. ఓవర్‌కు నాలుగు రన్ రేట్‌కు తగ్గకుండా వీలైతే 5 కూడా దాటి ఆడే ఇంగ్లండ్.. రాంచీలో తొలి రోజు 3. 40ని దాటలేదు. ఈ సిరీస్‌లో తొలి మూడు టెస్టులలో అట్టర్ ఫ్లాఫ్ అయి తీవ్ర విమర్శలు ఎదుర్కుంటున్న ఆ జట్టు మాజీ సారథి జో రూట్.. (226 బంతులలో 106 నాటౌట్, 9 ఫోర్లు) రాంచీలో సెంచరీతో రాణించాడు. అతడికి తోడుగా వికెట్ కీపర్ బెన్ ఫోక్స్ (126 బంతుల్లో 47, 4 ఫోర్లు, 1 సిక్స్), జాక్ క్రాలే (42), లోయరార్డర్‌లో ఒలీ రాబిన్సన్ (60 బంతుల్లో 31 నాటౌట్, 4 ఫోర్లు, 1 సిక్సర్) రాణించడంతో ఆ జట్టు తొలి రోజు 90 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 302 పరుగులు చేసింది. భారత బౌలర్లలో అరంగేట్ర బౌలర్ ఆకాశ్ దీప్ (3/68) ఇంగ్లండ్ టాపార్డర్‌ను కుప్పకూల్చాడు.

**ఆకాశ్ అదుర్స్..**

రాంచీలో టాస్ గెలిచి బ్యాటింగ్‌కు వచ్చిన ఇంగ్లండ్.. తొలి వికెట్‌కు బెన్ డకెట్ (11), జాక్ క్రాలేలు 47 పరుగులు జోడించింది. కానీ యువ బౌలర్ ఆకాశ్ దీప్.. మూడు ఓవర్ల వ్యవధిలోనే ఇంగ్లండ్ మూడు వికెట్లు తీశాడు. అతడు వేసిన పదో ఓవర్లో రెండో బంతికి బెన్ డకెట్‌ను ఔట్ చేసిన అతడు.. నాలుగో బంతికి ఓలీ పోప్‌ను డకౌట్ చేశాడు. 12వ ఓవర్లో ఐదో బంతికి జాక్ క్రాలే బౌల్డ్ అయ్యాడు. 35 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్సర్ సాయంతో 38 పరుగులు చేసిన జానీ బెయిర్ స్టోను అశ్విన్ వికెట్ల ముందు దొరకబుచ్చుకున్నాడు.

**రూట్ మార్చిన రూట్..**

బజ్‌బాల్ ఆటలో పడి తన అసలు ఆటను మరిచిపోతున్నాడన్న విమర్శలు ఎదుర్కుంటున్న రూట్ ఈ మ్యాచ్‌లో ఎట్టకేలకు తన పూర్వపు ఆటను ఆడాడు. టీమిండియా స్టార్ పేసర్ బుమ్రా లేకపోవడం కూడా అతడికి కలిసొచ్చింది. దూకుడు ఆటను వదిలేసి డిఫెన్స్‌కే అధిక ప్రాధాన్యమిచ్చిన రూట్.. ఇంగ్లండ్ ఇన్నింగ్స్‌ను నిలబెట్టాడు. బెయిర్ స్టో తో కలిసి 52 పరుగులు జోడించాడు. ఇంగ్లండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ (3) విఫలమైనా వికెట్ కీపర్ బెన్ ఫోక్స్‌తో కలిసి ఐదో వికెట్‌కు 113 పరుగులు జోడించాడు. 112 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయిన ఇంగ్లండ్‌ను ఈ ఇద్దరూ ఆదుకున్నారు. ఎట్టకేలకు ఈ జోడీని సిరాజ్ విడదీశాడు. బెన్ ఫోక్స్‌తో పాటు టామ్ హర్ట్లీ ( 13)ని కూడా అతడు పెవిలియన్‌కు పంపాడు. ఒక్కో పరుగు కూడదీసు కుంటూ వచ్చిన రూట్.. 219 బంతుల్లో సెంచరీ పూర్తిచేశాడు. టెస్టులలో అతడికి ఇది 31వ సెంచరీ కావడం గమనార్హం. ఏడు వికెట్లు పడగొట్టిన భారత బౌలర్లకు రూట్.. రాబిన్సన్‌లు తొలి రోజు మరో వికెట్ ఇవ్వలేదు. ఈ ఇద్దరూ ఇప్పటికే 8 వికెట్‌కు అజేయంగా 57 పరుగులను జోడించారు. తొలి రోజు ఆట ముగిసే సమయానికి ఇంగ్లండ్.. 7 వికెట్లు కోల్పోయి 302 పరుగులు చేయగా రాబిన్సన్, రూట్‌లు క్రీజులో ఉన్నారు.

# విజృంభించిన హెడ్, జంపా.. పొట్టి సిరీస్ ఆసీస్ కైవసం

న్యూజిలాండ్ పర్యటనలో వరల్డ్ చాంపియన్ ఆస్ట్రేలియా(%ాబర్తీఖ్రశ్రీఋ%) అదరగొడుతోంది. వరుసగా రెండో విజయంతో పొట్టి సిరీస్(%ు20 ావతీఅవం%) కైవసం చేసుకుంది. తొలి టీ20లో కివీస్‌ను చిత్తు చేసిన మిచెల్ మార్ష్ సేన.. రెండో టీ20లోనూ గెలుపొందింది. తొలుత ట్రావిస్ హెడ్(45) రాణించడంతో కంగారూ జట్టు 174 రన్స్‌కు ఆలౌట్యింది. అనంతరం బౌలర్లు రాణించడంతో బ్లాక్‌క్యాప్స్‌ను 72 పరుగుల తేడాతో చిత్తు చేసింది. దాంతో, మరో మ్యాచ్ ఉండగానే 2-0తో పొట్టి సిరీస్ చేజిక్కించుకుంది. ఆక్లాండలోని ఈడెన్ పార్క్‌లో జరిగిన రెండో టీ20లో ఆస్ట్రేలియా బ్యాటర్లు విఫలమయ్యారు. కంగారూ టీమ్‌లో హెడ్(45), ప్యాట్ కమిన్స్(28), కెప్టెన్ మిచెల్ మార్ష్(26)లు మాత్రమే రాణించారు. కివీస్ బౌలర్లలో ఫెర్గూసన్ నాలుగు, మిల్నే, శాంట్నర్‌లు తలా రెండేసి వికెట్లు తీశారు. స్వల్ప లక్ష్య ఛేదనలో న్యూజిలాండ్ అదినుంచి తడబడింది. ఆల్‌రౌండర్ గ్లెన్ ఫిలిఫ్స్ ఒక్కడే(42) ఒంటరి పోరాటం చేశాడు. చివర్లో ట్రెంట్ బౌల్ట్(16), జోష్ క్లార్క్‌సన్(10)లు కాసేపు పోరాడినా సరిపోలేదు. ఆడం జంపా నాలుగు వికెట్లు తీయడంతో కివీస్ 17 ఓవర్లలోపే ఆలౌటయ్యింది. వరుసగా రెండో ఓటమితో సిరీస్ చేజార్చుకుంది. నామమాత్రమైన మూడో టీ20 ఫిబ్రవరి 25వ తేదీన జరుగనుంది.






## దాదా సాహెబ్ ఫాల్కే అవార్డ్స్.. ఉత్తమ చిత్రంగా ప్రభాస్ 'సలార్'

2024 ఎపాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటించిన రీసెంట్ బ్లాక్ బస్టర్ సలార్ ఇప్పటికే ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల వర్షం కురిపించిన విషయం తెలిసిందే. ఇప్పటివరకు ఈ చిత్రం వరల్డ్ వైడ్‌గా రూ.800 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టింది. ఇదిలావుంటే తాజాగా ఈ చిత్రం మరో అరుదైన ఘనతను అందుకుంది. ఇండియన్ సినీ చరిత్రలో ప్రతిష్టాత్మకంగా భావించే 'దాదా సాహెబ్ ఫాల్కే ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ (డీపీఐఎఫ్ఎఫ్)–2024'లో ఉత్తమ చిత్రంగా ఎంపికైంది. ఈ విషయాన్ని దాదా సాహెబ్ ఫాల్కే నిర్వాహకుల కమిటీ ఎక్స్ వేదికగా అనౌన్స్ చేసింది. "ఇలాంటి ఒక దృశ్య కావ్యం (ఇతిహాసం) తీసిన గొప్ప టీమ్ కి మా అభినందనలు. మీ ఊహల నుంచి తెర మీద వరకు ఈ ప్రయాణం మీ సమర్థతకు నిదర్శనం". అంటూ దాదా సాహెబ్ ఫాల్కే టీమ్ రాసుకోచ్చింది. మరోవైపు ఈ ఫిల్మ్ ఫెస్టివల్‌కు సంబంధించి అవార్డుల కార్యక్రమం గత మంగళవారం ముంబైలో ఘనంగా జరిగింది. భారత సినీ ప్రముఖులతో పాటు బాలీవుడ్ సినీ ప్రముఖులు ఈ కార్యక్రమంలో సందడి చేశారు. ఇక ఈ అవార్డుల్లో గత ఏడాది విడుదలైన 'జవాన్', 'యానిమల్' చిత్రాలు పోటీ పడ్డాయి. జవాన్‌లో షారుఖ్ నటనకు గాను ఉత్తమ నటుడిగా అవార్డు అందుకోగా.. ఈ సినిమాలో హీరోయిన్‌గా నటించిన నయనతార ఉత్తమ నటి అవార్డు అందుకుంది. ఇక గతేడాది యానిమల్ సినిమాతో కలెక్షన్ల వర్షం కురిపించిన దర్శకుడు సందీప్ రెడ్డి వంగా ఉత్తమ దర్శకుడిగా నిలిచారు.





## నయా సస్పెన్స్ థ్రిల్లర్

నయా సస్పెన్స్ థ్రిల్లర్'కాంచన 3, రూలర్' సినిమాలతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన హీరోయిన్ వేదిక. ఆమె లీడ్ రోల్‌లో నటిస్తున్న సస్పెన్స్ థ్రిల్లర్ "ఫియర్". దత్తాత్రేయ మీడియా బ్యానర్ పై ప్రొడ్యూసర్ ఏఆర్ అభి నిర్మిస్తున్నారు. సుజాత రెడ్డి, సామ సురేందర్ రెడ్డి కో ప్రొడ్యూసర్స్‌గా వ్యవహరిస్తున్నారు. దర్శకురాలు హరిత గోగినేని ఈ మూవీని రూపొందిస్తున్నారు. అరవింద్ కృష్ణ ఓ స్పెషల్ రోల్‌లో కనిపించనున్నారు. బుధవారం హీరోయిన్ వేదిక పుట్టినరోజు సందర్భంగా ఆమెకు బర్త్ డే విషెస్ చెటబుతూ మూవీ టీమ్ ఓ స్పెషల్ పోస్టర్‌ని రిలీజ్ చేసింది. ఈ పోస్టర్‌లో వేదిక బ్యూటిఫుల్ మేకోవర్‌లో కనిపించి అందర్నీ ఆకట్టుకుంటోంది. ఈ సినిమాలో వేదిక క్యారెక్టర్ కొత్తగా ఉంటూ ప్రేక్షకులను మెస్మరైజ్ చేయనుంది. ఆమె కెరీర్‌లో ఇదొక స్పెషల్ మూవీ అవుతుందని చిత్రబృందం చెబుతున్నారు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ పూర్తి చేసుకుని పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుపుకుంటోంది. త్వరలోనే ఈ సినిమా థియేట్రికల్ రిలీజ్ డేట్‌ను అనౌన్స్ చేయబోతున్నారు. జెపి (జయప్రకాష్), పవిత్ర లోకేష్, అనీష్ కురువిల్ల, సాయాజి షిండే, సత్య కృష్ణ, సాహితి దాసరి, షాని తదితరులు నటిస్తున్నారు.

## రామ్‌చరణ్‌తో భారీ యాక్షన్ ఎపిసోడ్

మెగా పవర్ స్టార్ రామ్‌చరణ్ కథానాయకుడిగా కోలీవుడ్ దర్శకుడు శంకర్ దర్శకత్వంలో తెరకెక్కిస్తున్న తాజా చిత్రం 'గేమ్ ఛేంజర్'. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్ రాజు నిర్మిస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ జరుగుతున్నది. 'ఆర్ఆర్ఆర్' వంటి బ్లాక్‌బస్టర్ హిట్ తర్వాత రామ్‌చరణ్ నటిస్తున్న ఈ సినిమాపై అభిమానుల్లో భారీ అంచనాలేర్పడ్డాయి. ఇక ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం రామోజీ ఫిలిం సిటీలో శరవేగంగా జరుపుకుంటుంది. తాజాగా ఈ సినిమా షూటింగ్ సంబంధించి రామ్‌చరణ్, నవీన్‌చంద్రపై ఓ యాక్షన్ బ్లాక్‌ని చిత్రీకరిస్తునట్లు సమాచారం. ఇక ఈ షెడ్యూల్ మార్చి 2 వరకు జరగనుంది. ఓ సాధారణ యువకుడు అసాధారణ నాయకుడిగా ఎదిగిన వైనాన్ని ఆవిష్కరిస్తూ చక్కటి సామాజిక సందేశంతో దర్శకుడు శంకర్ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారని చెబుతున్నారు. ఈ సినిమాలో తండ్రీకొడుకులుగా రామ్‌చరణ్ ద్విపాత్రాభినయంలో కనిపిస్తారు. ఈ సినిమాలో బాలీవుడ్ బ్యూటీ కైరా అద్వానీ కథానాయికగా నటిస్తోంది. అరవింద్ స్వామి, ఎస్‌జే సూర్య, సురేష్ గోపి, ఈషా గుప్తా, అంజలి, శ్రీకాంత్, జయరామ్, సునీల్, హ్యారీ జోష్ మరియు నవీన్ చంద్ర ఈ సినిమాలో కీలక పాత్రలలో కనిపించనున్నారు.





## శ్రీవల్లి పాత్ర అంచనాలకు మించి

పుష్ప 2 ది రైజ్ లో అందరూ అల్లు అర్జున్ గురించే ఆలోచిస్తున్నారు కానీ ఈసారి రష్మిక మందన్నకు ఊహించని స్థాయిలో ప్రాధాన్యం ఉంటుందని యూనిట్ నుంచి అందుతున్న లీక్.మొదటి భాగంలో పెళ్లి చేసుకోవడం వరకే నడిపించిన దర్శకుడు సుకుమార్ ఈసారి శ్రీవల్లిని గర్భవతిగా చూపిస్తాడట. ఈ థ్రెడ్ చాలా ఎమోషనల్ గా ఉంటుందని, పుష్పరాజ్ లోని సున్నితత్వం కొత్తగా ఆవిష్కరించారని అంటున్నారు. పుష్ప 1లో తక్కువ మోతాదులో మదర్ సెంటిమెంట్ తప్ప ఇంకో భావోద్వేగం హైలైట్ కాలేదు. కానీ పుష్ప 2లో ఆ లెక్కలన్నీ సరిచేశారని సమాచారం.సో యానిమల్ తర్వాత జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్న రష్మిక మందన్న ఇమేజ్ అమాంతం రెట్టింపయ్యేలా సుక్కు పర్ఫెక్ట్ గా ప్లాన్ చేశారని తెలిసింది. పుష్ప, శ్రీవల్లి కలిసి థియేటర్ లో ఇంద్ర సినిమా చూసేందుకు వెళ్లే ఎపిసోడ్ ని ఓ రేంజ్ లో షూట్ చేసినట్టు ఆల్రెడీ టాక్ ఉంది. గంగమ్మ జాతర తర్వాత దీని గురించే మాట్లాడుకుంటారట. మొత్తానికి గూస్ బంప్స్ మూమెంట్స్ చాలా ఉండేలా సుకుమార్ ఈసారి స్పెషల్ ప్యాకేజ్ ఇవ్వబోతున్నారు. జపాన్ వెళ్లి అక్కడి మాఫియా డాన్ ని హతమార్చే ట్రాక్ గురించి గతంలో మా సైట్ ఎక్స్ క్లూజివ్ గా చెప్పిన సంగతి తెలిసిందే. ఆగస్ట్ 15 విడుదల తేదీని ఎట్టి పరిస్థితుల్లో మిస్ కాకుండా ఉండేందుకు టీమ్ అన్నిరకాలుగా డే అండ్ నైట్ కష్టపడుతోంది. ఏ మాత్రం వాయిదా పడినా ఎగరేసి తీసుకుపోయేందుకు ఇతర ప్యాన్ ఇండియా సినిమాలు కాచుకుని ఉండటంతో మైత్రి బృందం ఆ ఛాన్స్ ఇవ్వకూడదనే సంకల్పంతో ఉంది. కీలకమైన భాగాలకు పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. జూన్ లో డబ్బింగ్ కార్యక్రమాలకు ప్లాన్ చేస్తున్నారు.

## శ్రీవిష్ణు 'ఓం భీమ్ బుష్' టీజర్ అప్‌డేట్ వచ్చేసింది..

టాలీవుడ్ యువ నటులు శ్రీవిష్ణు, రాహుల్ రామకృష్ణ, ప్రియదర్శి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం 'ఓం భీమ్ బుష్' నో లాజిక్.. ఓన్లీ మ్యాజిక్ అనేది ఉపశీర్షిక. ఈ సినిమాకు 'హుషార్' డైరెక్టర్ శ్రీ హర్ష కొనుగంటి దర్శకత్వం వహిస్తుండగా.. యూవీ క్రియేషన్స్ నిర్మిస్తుంది. రీసెంట్‌గా ఈ సినిమా నుంచి ఫస్ట్ లుక్ విడుదల చేయగా ప్రేక్షకుల వద్ద నుంచి మంచి రెస్పాన్స్ వచ్చింది. ఇదిలావుంటే తాజాగా ఈ సినిమా నుంచి మేకర్స్ టీజర్ అప్‌డేట్ ఇచ్చారు. ఈ సినిమా టీజర్‌ను ఫిబ్రవరి 26న విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఇక బ్రోచేవారెవరురా తర్వాత (శ్రీవిష్ణు, రాహుల్ రామకృష్ణ, ప్రియదర్శి) కాంబో రిపీట్ అవుతుండడంతో ఈ సినిమా ఫుల్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా రానున్నట్లు తెలుస్తుంది. ఇక ఈ చిత్రం మార్చి 22న ప్రేక్షకుల ముందుకు రానుంది.

